



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 12 సంచిక : 344 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : విశాఖపట్నం | శుక్రవారం 14 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :344 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : VISAKHAPATNAM | FRI 14 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసులు..

## ప్రారంభించిన రామ్మోహన్

**పెన్ పవర్ డెస్క్:** ఏపీ ప్రజలకు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా నూతన ఇండిగో సర్వీసులను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభం కానుంది. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. మంగళ, గురు, శనివారాలు ఈ నగరాల మధ్య విమానాలు

- మిగతా 2లో

# ఇది ఆరంభం మాత్రమే..

## గ్రాఫిక్స్ అన్నవాళ్ల కళ్లు తెరిపించేలా అమరావతి

- అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం
- హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రపంచ టాప్ 5 నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని వెల్లడి
- రాజధాని నిర్మాణానికి ఐదు కీలక సూత్రాలను ప్రకటించిన ముఖ్యమంత్రి
- భూములిచ్చిన రైతుల త్యాగాన్ని కొనియాడిన చంద్రబాబు
- మూడు రాజధానుల విధానంతో గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని విమర్శ
- 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపు





**పెన్ పవర్ డెస్క్:** మూడు రాజధానుల పేరుతో గత ప్రభు త్వం ఆడిన 'మూడు ముక్కల ఆట'తో అమరావతి, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు పూర్తిగా విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపి, 30 వేల ఎకరాలు అవసరమని చెప్పిన ఆనాటి ప్రతిపక్ష నేత, అధికారంలోకి వచ్చాక మాట మార్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో కీలకమైన సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, గత ఐదేళ్లలో అమరావతిపై జరిగిన కుట్రలను, విధ్వంసాన్ని పూసగుచ్చినట్టు వివరించారు.

**అసెంబ్లీలో ఒక మాట.. బయట మరో నాటకం**

గత ప్రభుత్వ తీరును ఎండగడుతూ చంద్రబాబు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఆనాడు అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు, రాజధానికి 30 వేల ఎకరాలు చాలదు, 40-50 వేల ఎకరాలు ఉండాలని ఆనాటి ప్రతిపక్ష నాయకుడు గొంతెత్తారు. తాను కూడా ఇక్కడే ఇల్లు కట్టుకుంటానని నాటకాలు ఆడారు. కానీ, ఎన్నికల్లో గెలిచిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేశారు. ఈ చర్య నన్ను తీవ్రంగా బాధించింది"

- మిగతా 2లో



## చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారు

- జైలులో నన్ను కూడా అవమానించారు: జగన్
- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్
- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్
- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ
- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:** రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ..

- మిగతా 2లో



## 'పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు..

## కేంద్రం జోక్యం చేసుకోవాలి

- రాజ్యసభలో పంచధారల మైనింగ్ అంశాన్ని లేవనెత్తిన వైవీ సుబ్బారెడ్డి
- వారసత్వ కట్టడాల పరిరక్షణకు మైనింగ్ తక్షణం ఆపాలని డిమాండ్
- కేంద్ర మంత్రులను కలిసి ఫిర్యాదు చేసిన వైసీపీ ఎంపీలు
- అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణకు అభ్యర్థన
- 10 రోజుల్లోగా కేంద్ర బృందం పరిశీలిస్తుందని కేంద్ర మంత్రుల హామీ

- మిగతా 2లో

## ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు.. వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

- ప్రపంచ ఏనుగుల దినోత్సవంలో పాల్గొన్న పవన్ కల్యాణ్
- దేశంలో ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కి పెరిగిందన్న డిప్యూటీ సీఎం
- మానవ-ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:** ఏనుగులు కేవలం అడవులకే పరిమితం కాకుండా జీవవైవిధ్యానికి కాపలాదారులుగా, దేశ సంస్కృతి, వారసత్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహించిన ప్రపంచ ఏనుగుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, వన్యప్రాణుల సంరక్షణ, మానవ-ఏనుగుల సంఘర్షణ నివారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఏనుగుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం వల్ల, 2014 నుంచి ఏనుగుల రిజర్వుల సంఖ్య 26 నుంచి 33కు పెరిగిందని, అలాగే 150 ఏనుగుల కారిడార్లను గుర్తించి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 132 నుంచి 142 వరకు

- మిగతా 2లో






## మా సార్ మాకే కావాలి..

## రోడ్డెక్కిన విద్యార్థులు, వెనక్కి తగ్గిన ఝార్ఖండ్ ప్రభుత్వం

- ఝార్ఖండ్‌లో హెడ్ మాస్టర్ బదిలీపై విద్యార్థుల ఆందోళన
- మూడు రోజులుగా ప్రధాన రహదారిని దిగ్బంధించిన విద్యార్థులు
- నచ్చజెప్పబోయిన అధికారిపై దాడి, పోలీస్ స్టేషన్‌పై రాళ్లదాడి
- దిగివచ్చిన అధికారులు, హెడ్ మాస్టర్ బదిలీ ఉత్తర్వులు రద్దు
- ఉపాధ్యాయుడితో ఫోన్‌లో మాట్లాడి ఆందోళన విరమించిన విద్యార్థులు

- మిగతా 2లో

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

## మోదీపై రాహుల్ గాంధీ విమర్శలు



- ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్
- చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్
- బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన

- మిగతా 2లో

## ముందు భారత్‌కు తిరిగి రండి.. ఆ తర్వాతే పిటిషన్ విచారిస్తాం

## విజయ్ మాల్యాకు బాంబే హైకోర్టు స్పష్టీకరణ

- విదేశాల్లో ఉంటూ క్రిమినల్ బాధ్యతల నుంచి తప్పించుకోలేరన్న బాంబే హైకోర్టు
- ఇండియాకు తిరిగొస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని వెల్లడి
- ఎప్పుడు తిరిగొస్తారో పూర్తి వివరణ ఇవ్వాలని ఆదేశం

**పెన్ పవర్ డెస్క్:** పరారీలో ఉన్న ప్రముఖ వ్యాపారవేత్త విజయ్ మాల్యా దాఖలు చేసిన పిటిషన్లపై బాంబే హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తారో స్పష్టం చేస్తూ అఫిడవిట్ దాఖలు చేస్తే తప్ప... 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం' చట్టబద్ధతను సవాలు చేస్తూ ఆయన వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టబోమని ధర్మాసనం తెగేసి చెప్పింది. దేశం దాటి విదేశాల్లో

- మిగతా 2లో



## 'సర్' పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు.. ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక


**పెన్ పవర్ డెస్క్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం హెచ్చరించారు.

- మిగతా 2లో




# మీరు చేయకపోతే మేమే చేస్తాం

## ప్యాకేజ్డ్ ఫుడ్ అంశంలో కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



- ప్యాకేజ్డ్ ఫుడ్‌పై హెచ్చరిక లేబుళ్లపై కేంద్రానికి సుప్రీంకోర్టు అల్టిమేటం
- కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గుతున్నారా అని కేంద్రాన్ని నిలదీత
- తుది నిర్ణయం చెప్పేందుకు ప్రభుత్వానికి రెండు వారాల గడువు

**పెన్ పవర్ డెస్క్:** అధిక మొత్తంలో ఉప్పు, చక్కెర, కొవ్వు ఉండే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్యాకెట్లపై ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయడంలో జరుగుతున్న జాప్యంపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు చేయలేకపోతే, మేమే అమలు చేసేలా చూస్తాం" అంటూ గట్టి హెచ్చరిక జారీ చేసింది.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# డ్రగ్స్ ముప్పు నుంచి బయిటపడేదెలా..

తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య ఇంతింతై వటుడింతై అన్నట్టుగా విస్తరిస్తోంది. మొదట్లో హైదరాబాద్ కు మాత్రమే పరిమితం అనుకున్న డ్రగ్స్ ఇప్పుడు.. ఎడాపెడా ఎక్కడపడితే అక్కడ పట్టుబడుతున్నాయి. చివరకు డ్రగ్స్ పెడ్లర్లలో డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులు కూడా ఉండటం అందర్నీ అవాక్కయ్యేలా చేస్తోంది. అంతకుముందు పబ్బులు, క్లబ్బుల్లో మాత్రమే డ్రగ్స్ దందా జరుగుతోందనే భ్రమలో ఉన్న అధికారులకు.. ఇటీవలి కేసులు కళ్లు తెరిపిస్తున్నాయి. ఉదాహరణకు వీకెండ్‌లో డాక్టర్లంతా ఓ చోట కలుస్తుంటారు. అది పైకి సాధారణ గెట్‌టుగెదర్‌లాగే ఉంటుంది. కానీ పొరపాటున పోలీసులొస్తే.. వారంతా కంగారు పడతారు. పరారవటానికి ప్రయత్నిస్తారు. అలాంటి సందర్భాల్లో డాక్టర్ల దగ్గర డ్రగ్స్ దొరకటం చూసి పోలీసులు విస్తుపోతున్నారు. అదే సమయంలో స్కూలు బ్యాగ్‌లు, కాలేజీ క్యాంటీన్లలో డ్రగ్స్ పట్టుబడే కల్చర్ కూడా బాగా పెరిగిపోయింది. ఇప్పటికే చాలాసార్లు విద్యాసంస్థల యాజమాన్యాలకు పోలీసులు వార్నింగ్ ఇచ్చినా.. ప్రతి విద్యార్థిని 24 గంటలు తాము మాత్రం ఎలా గమనించగలమని అవి చేతులెత్తేశాయి. చివరకు క్యాంపస్‌లో డ్రగ్స్ దొరక్కుండా జాగ్రత్తపడుతున్నాయి. కానీ డ్రగ్స్ మత్తుకు అలవాటుపడ్డ విద్యార్థులు ఏదో మార్గంలో డ్రగ్స్ తీసుకుంటూనే ఉన్నారు. విద్యార్థుల సౌకర్యం కోసం.. డ్రగ్స్ చాక్లెట్లు, డ్రగ్స్ సిగరెట్లు విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అధికారులు డ్రగ్స్‌కు ఓ తలుపు మూసేస్తే.. మరో నాలుగు తలుపులు తెరుచుకుంటున్నాయి. అందుకే టాస్క్ ఫోర్స్, ఈగల్ పేరుతో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినా.. అనుకున్న స్థాయిలో డ్రగ్స్‌ను కట్టడి చేయడం సాధ్యం కావడం లేదు. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్లు..చేయాల్సిన పని వదిలిపెట్టి స్టూడెంట్స్ కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. కేరళలోని వడకరలో రెండ్రోజుల క్రితం వెలుగులోకి వచ్చిన రవాణలో కేసులో ముగ్గురు టీచర్లతో సహా ఓ డెలివరీ బాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుల వాట్సాప్ మేసేజ్ లు, బ్యాంకు అకౌంట్ల ట్రాన్సాక్షన్లు పరిశీలించిన పోలీసులు..డ్రగ్స్ సరఫరా వెనుక కింగ్ పిన్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన టీచర్లు ఇలాంటి అక్రమాలకు పాల్పడటం, డబ్బు కోసం అడ్డదారులు తొక్కడం వారి వ్యక్తిగత జీవితాలనే కాదు.. యువత భవిష్యత్తును కూడా నాశనం చేస్తుంది డ్రగ్స్ కొనుగోలుకు కావాల్సిన డబ్బుకోసం వాటి విక్రయానికి సిద్ధపడుతున్నారు. దొంగతనాలు, దోపిడీలకూ తెగబడుతున్నారు. గంజాయి మత్తు తలకెక్కి రాత్రిళ్లు వీధుల్లో గొడవలకు దిగుతూ భయోత్పాతం సృష్టిస్తున్నారు. జీవితాలు అల్లకల్లోలమై ఆఖరికి ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. కాసుల యావతో జాతి భవితవ్యాన్ని చీకట్లోకి నెడుతున్న డ్రగ్స్ కింగ్ పిన్లకు త్వరగా శిక్షలు పడకపోతుండటం వల్లే డ్రగ్స్ వెల్లువకు అడ్డుకట్టవేయడం సాధ్యపడట్లేదు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద 2022–24 మధ్య దేశవ్యాప్తంగా మూడు లక్షల కేసులు నమోదయ్యాయి. 3.75 లక్షల మంది అరెస్టయ్యారు. కానీ, 268 మందికే శిక్షలు పడ్డాయి. తనిఖీలు, నమూనాల జప్తు, తరలింపుల్లో లోపాలు, ఫోరెన్సిక్ పరీక్షల్లో ఆలస్యం వంటివి దుర్మార్గులకు వరమవుతున్నాయి. చాలా రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్‌డీపీఎస్ కోర్టులు లేకపోవడం వల్లా కేసుల మేటలు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం సంబంధిత కేసులు నాలుగు లక్షల వరకు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ వీలైనంత త్వరగా కొలిక్కి రావాలంటే– అవసరానికి తగినట్లు అన్నిచోట్లా స్పెషల్ కోర్టులను ఏర్పాటుచేయాలి. డ్రగ్స్ కేసుల దర్యాప్తులో సిబ్బందికి తగిన శిక్షణ అందించాలి. మాదకమూకల పీచమణచడంలో అన్ని రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. అన్నింటికన్నా ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలు ఏం చేస్తున్నారో కనిపెట్టుకుని ఉంటూ, వారి ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించాలి. ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి డ్రగ్స్ వల్ల తలెత్తే దుష్పరిణామాలపై విద్యార్థులకు అనునిత్యం అవగాహన కల్పిస్తూ, వారిని సరైన దారిలో నడిపించాలి. లేకపోతే భావి భారతం మనం ఊహించలేనంత ప్రమాదకరంగా మారుతుందని చెప్పటానికి సంకోచించాల్సిన పని లేదు. ఈ కారణంగానే ఐఐటీ , ఐఐఎంలతో సహా దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో పెరుగుతున్న డ్రగ్ కల్చర్ కు చెక్ పెట్టేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఐఐటీ, ఐఐఎంలతో ప్రారంభించి అన్ని ఉన్నత విద్యాసంస్థల్లోనూ విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలోనే స్వచ్ఛంద డ్రగ్స్ టెస్టులు నిర్వహించబోతున్నారు. ఈ మేరకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. ఆయా సంస్థల్లో అడ్మిషన్లు కోరే అభ్యర్థులు తమ అడ్మిషన్ పత్రాలతో పాటు యాంఫెటమైన్లు, కొకైన్, గంజాయి, బెంజోడయాజెపైన్లు, ఫెన్సైక్లిడిన్ వంటి మాదకద్రవ్యాల నిర్ధారణకు స్వచ్ఛందంగా యూరిన్ టెస్ట్ చేయించుకోవాలి. కేంద్ర విద్యా శాఖకు చెందిన ఉన్నత విద్యా విభాగం చేపట్టిన ఈ కార్యక్రమం, దేశంలో మాదకద్రవ్యాల సమస్యను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా చెప్తున్నారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో మాదకద్రవ్యాల నియంత్రణ విజన్ డాక్యుమెంట్ 2026–29లో దీన్ని జత చేశారు. దీని ప్రకారం వచ్చే మూడేళ్లలో కేంద్ర నిధులతో నడిచే 170 ఉన్నత విద్యా సంస్థలలోని సుమారు 10 లక్షల మంది విద్యార్థులకు దశలవారీగా డ్రగ్స్ పరీక్షలు నిర్వహిస్తారు. 2029 నాటికి 10 లక్షల మంది విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై పరీక్షలు నిర్వహించే మిషన్ ను ప్రధాని మోడీ ఆగస్టు 2న ప్రారంభించారు. దీనికి నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌గా పేరు పెట్టారు. ఢిల్లీ ఎయిమ్స్ లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ ఈ మేరకు కాలేజీలు, వర్సిటీల విద్యార్థులకు డ్రగ్స్ పరీక్షల కోసం మార్గదర్శకాలు ఇచ్చింది. ఇందులో డ్రగ్స్ పరీక్ష పూర్తిగా స్వచ్ఛందంగా, గోప్యంగా ఉండాలని, పరీక్ష చేయించుకునే విద్యార్థులపై ఎటువంటి ప్రతికూల పరిణామాలకు దారితీయకూడదని, దీనిని కేవలం కౌన్సెలింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉంచాలని సూచించింది. ఈ డ్రగ్ పరీక్షల కార్యక్రమం మూడు దశల్లో అమలు చేస్తారు. మొదటి దశలో ఈ ఏడాది ఐఐటీలు, ఐఐఎంలు, ఒక సెంట్రల్ యూనివర్శిటీలో చేపడతారు. వచ్చే ఏడాది 32 ఎన్‌ఐటీలు, ఎనిమిది ఐఐఎస్‌ఆర్ లు, మూడు ఎస్పీఏలు, 25 ట్రిపుల్ ఐటీలు, కేంద్ర నిధులతో నడిచే నాలుగు జేఎన్టీయూల్లో చేపడతారు. ఆ తర్వాత 2028–29లో 46 సెంట్రల్ యూనివర్సిటీలు ,నాలుగు డీమ్డ్–టు–బి విశ్వవిద్యాలయాలకు వీటిని విస్తరిస్తారు. డ్రగ్స్ తాత్కాలిక ఉత్తేజాన్ని ఇవ్వొచ్చు కానీ…అవి జీవితం మొత్తాన్నీ నాశనం చేస్తాయని ప్రధాని మోడీ యువతను హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈ మేరకు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. కాబట్టి ఎవరి పిల్లల గురించి వారే మొదట జాగ్రత్తలు తీసుకోవాలి. స్కూళ్లు, కాలేజీల నుంచి టైంకి ఇంటికొస్తున్నారా.. లేదా..? బ్యాగుల్లో ఏం తీసుకెళు‌న్నారు..? ఎలాంటి స్నేహితులతో తిరుగుతున్నారు..? లాంటి కనీస జాగ్రత్తలు పాటించటం అత్యవసరమని నిపుణులతో పాటు ప్రభుత్వాలు కూడా సూచిస్తున్నాయి. ఎందుకంటే ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితం కావాలనే సంకల్పం తీసుకుంటే.. ఆటోమేటిగ్గా హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలు కూడా డ్రగ్స్ రహితం కావడం పెద్ద కష్టం కాదు. చివరిగా దేశం కూడా డ్రగ్స్ నుంచి విముక్తం అవుతుంది.

# మీరు చేయకపోతే మేమే చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఈ విషయంలో తుది నిర్ణయం తెలియజేయడానికి కేంద్రానికి రెండు వారాల గడువును మంజూరు చేసింది.

జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇది ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికి సంబంధించిన కీలకమైన అంశమని, కార్పొరేట్ సంస్థల ఒత్తిడికి తలొగ్గి నిర్ణయాలు తీసుకోవద్దని ధర్మాసనం స్పష్టం చేసింది. "తయారీదారులు తమ వ్యాపారం దెబ్బతింటుందన్న ఉద్దేశంతో ఈ లేబుళ్లను వ్యతిరేకించవచ్చు, కానీ తాము కొనుగోలు చేసే వస్తువులో ఏయే పదార్థాలు ఉన్నాయో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది" అని కోర్టు వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తే నమ్‌కీన్ వంటి భారతీయ సంప్రదాయ ఆహార పదార్థాలపై కూడా 'రెడ్ మార్క్' పడుతుందని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ చాహర్ వాదించారు. అయితే, ఈ వాదనను కోర్టు తోసిపుచ్చింది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వం బాధ్యత కాదా అని ప్రశ్నించింది. రెండు వారాల్లోగా ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని తెలియజేయాలని, లేనిపక్షంలో తదుపరి విచారణలో తామే తగిన ఉత్తర్వులు వెలువరిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# ఏనుగులు జీవవైవిధ్యానికి కాపలాదారులు..
## వాటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి

- మొదటి పేజీ తరువాయి

అడవి ఏనుగులు ఉన్నాయని వెల్లడించారు. పలమనేరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ప్రధాన సమస్యగా మారిన మానవ–ఏనుగుల సంఘర్షణను అరికట్టేందుకు కర్ణాటక ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకువచ్చి ముసలివాగు వద్ద ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, వీటి సహాయంతో 50కి పైగా ఆపరేషన్లు నిర్వహించి మానవ మరణాలను 70 శాతం వరకు తగ్గించగలిగామని స్పష్టం చేశారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'హనుమాన్' కార్యక్రమంలో భాగంగా ర్యాపిడ్ రెస్పాన్స్ వాహనాలతో పాటు ఏడు ప్రత్యేక వన్యప్రాణుల అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటి ద్వారా ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా ప్రత్యేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఏనుగుల సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి భాగస్వామ్యంతో ఒక ప్రజా ఉద్యమంగా మారాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# ఇది ఆరంభం మాత్రమే..

- మొదటి పేజీ తరువాయి

అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ కక్షతోనే అమరావతిని చంపేయాలని చూశారని, ఈ క్రమంలో రైతుల త్యాగాలను అవమానించారని మండిపడ్డారు.

**గ్రాఫిక్స్ అన్నవాళ్లే తలదించుకుంటూరు**

అమరావతి నిర్మాణ ప్రణాళికలను 'గ్రాఫిక్స్' అని ఎగతాళి చేసిన వారిపై చంద్రబాబు తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. "మేము ప్రపంచ స్థాయి నమూనాలతో ఐకానిక్ భవనాలు ప్లాన్ చేస్తే, వాటన్నిటినీ గ్రాఫిక్స్ అన్నారు. ఆ గ్రాఫిక్స్ నిజమైతే వారి పరిస్థితి ఏమవుతుందో ఒక్కసారి ఆలోచించుకోవాలి. ఈరోజు ప్రారంభమైన ఈ రాజమార్గమే వారికి సమాధానం చెబుతుంది" అని ఆయన అన్నారు. అమరావతి నిర్మాణానికి సహకరించిన సింగపూర్ ప్రభుత్వంపై కూడా గత పాలకులు వేధింపులకు పాల్పడ్డారని, వారిని కూడా ఇబ్బంది పెట్టే దుస్థితికి దిగజారారని చంద్రబాబు ఆరోపించారు. అంతర్జాతీయంగా రాష్ట్ర పరువును మంటగలిపారని విమర్శించారు.

**రైతుల ఉద్యమం చారిత్రాత్మకం**

అమరావతి కోసం రైతులు చేసిన పోరాటాన్ని చంద్రబాబు కొనియాడారు. "చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఉద్యమం ఏదైనా ఉందంటే అది అమరావతి రైతుల ఉద్యమమే. మీరు పడిన కష్టాలు నేను కళ్లారా చూశాను. మీకు అండగా నిలవడానికి పార్టీ ఖాతాలో డబ్బులు లేని సమయంలో నేను జోలె పట్టి డబ్బులు వసూలు చేసి న్యాయపోరాటానికి సహకరించాను. నా భార్య సైతం తన చేతి గాజులు తీసి ఉద్యమానికి విరాళంగా ఇచ్చింది. అలాంటి మీ త్యాగాల పునాదులపైనే ఈ రాజధాని మళ్లీ నిలబడుతోంది. మీ పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా" అని భావోద్వేగంగా ప్రసంగించారు. చిన్న చిన్న న్యాయపరమైన అడ్డంకులు సృష్టించి ప్రాజెక్టును ఆపాలని చూసినా, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని హైకోర్టు సైతం స్పష్టం చేసిందని గుర్తుచేశారు.

**ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతి**

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అదొక అద్భుతమైన భవిష్యత్తు దర్పణమని చంద్రబాబు అన్నారు. ఐదు ప్రధాన సూత్రాలతో దీనిని నిర్మించనున్నట్లు తెలిపారు.

1. నో పోల్స్ సిటీ: రోడ్లపై కరెంట్ స్తంభాలు, వైర్లు కనిపించకుండా అండర్‌గ్రౌండ్ డక్ట్ వ్యవస్థ.
2. బ్లూ సిటీ: కృష్ణా, గోదావరి జలాలతో నగరం మొత్తం నీటి వనరులతో కళకళలాడటం.
3. గ్రీన్ సిటీ: 50 శాతానికి పైగా పచ్చదనంతో, అత్యుత్తమ జీవవైవిధ్యంతో ప్రపంచంలోనే నంబర్ వన్‌గా నిలపడం.
4. గ్రీన్ ఎనర్జీ: సోలార్ వంటి పునరుత్పాదక ఇంధనాలతో 'నెట్ జీరో కార్బన్' నగరంగా తీర్చిదిద్దడం.
5. నాలెడ్జ్ ఎకానమీ: డీప్ టెక్నాలజీ, క్వాంటం కంప్యూటింగ్, ఉన్నత విద్యాసంస్థలతో విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు కేంద్రంగా మార్చడం.

ఈ ఐదు సూత్రాలతో అమరావతిని భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని టాప్–5 రాజధానుల్లో ఒకటిగా తీర్చిదిద్దుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్ సహకారంతో ఈ లక్ష్యాన్ని సాధిస్తామని స్పష్టం చేశారు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిస్వార్థంగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఈరోజు వేసింది మొదటి అడుగేనని, ఇకపై అమరావతి అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలను నెరవేర్చే సంకల్ప సిద్ధికి కేంద్రంగా అమరావతి నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు.

**"అనే నేను" – ప్రతి పౌరుడూ సైనికుడే**

2047 నాటికి భారతదేశం వికసిత భారత్‌గా, ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఈ లక్ష్య సాధనలో ప్రతి పౌరుడూ భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఒక్కరూ '... అనే నేను' (మీ పేరు చెప్పుకుని) అని ఒక సంకల్పం తీసుకోవాలి. మీ అభివృద్ధి, మీ కుటుంబం, మీ రాష్ట్రం, మీ దేశం కోసం ఏం చేస్తారో ప్రతిజ్ఞ చేయాలి. ఆ సంకల్పాన్ని ప్రతిరోజూ గుర్తుచేసుకుంటూ పనిచేయాలి. దేశ నిర్మాణంలో భాగస్వాములు కావడం అంటే యుద్ధాలు చేయడం కాదు. రైతు బాగా పంట పండిస్తే, విద్యార్థి బాగా చదువుకుంటే, ప్రతి ఒక్కరూ తమ వృత్తిలో రాణిస్తే అదే నిజమైన దేశభక్తి" అని స్పష్టం చేశారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, తిరంగా ర్యాలీలతో స్ఫూర్తిని నింపాలని కోరారు. ముఖ్యమంత్రి తన ప్రసంగం చివర్లో, ఈ రహదారి ప్రారంభోత్సవం అభివృద్ధి ప్రస్థానంలో తొలి అడుగు మాత్రమేనని, ఇక్కడి నుంచి ప్రతి రోజూ అమరావతి నిర్మాణం కోసం పనిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాలుపంచుకున్న రైతులు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ, "భారత్ మాతాకీ జై, తెలుగు తల్లికి జై, జై అమరావతి" నినాదాలతో తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# 'సర్' పేరుతో కాల్స్, ఎస్సెమ్మెస్‌లు.. ఓటర్లకు తెలంగాణ సీఈవో హెచ్చరిక

- మొదటి పేజీ తరువాయి

నగదుతో పాటు సున్నితమైన బ్యాంకింగ్ వివరాలను దొంగిలించేందుకు కొందరు మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు పంపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాల గురించి సీఈఓ కార్యాలయం సవివరంగా వెల్లడించింది. "ఓటరు గుర్తింపు కార్డులోని వివరాలు, 'సర్' ఫారంలోని వివరాలతో సరిపోలడం లేదని, అందుకే మీ దరఖాస్తు తిరస్కరణకు గురైందంటూ ఓటర్లకు సందేశాలు పంపుతున్నారు. సవరణ కోసం ఒక నంబర్‌కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ లింక్‌పై క్లిక్ చేయాలని వారు సూచిస్తున్నారు. ఆ తర్వాత, నామమాత్రంగా రూ. 5 చెల్లించాలని కోరుతూ, నెట్ బ్యాంకింగ్, క్రెడిట్/డెబిట్ కార్డుల లాగిన్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, సీవీవీ నంబర్లు, ఏటీఎం పిన్‌ల వంటి అత్యంత రహస్య సమాచారాన్ని కాజేసే ప్రయత్నం చేస్తున్నారు" అని సీఈవో వివరించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కానీ, తెలంగాణ సీఈఓ కార్యాలయం కానీ ఓటర్లకు ఇటువంటి సందేశాలు పంపదని, ఫోన్ కాల్స్ చేయదని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటువంటి మోసపూరిత సమాచారాన్ని నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత, ఆర్థిక వివరాలను పంచుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఉచితమని, దీనికి ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ఇటువంటి మోసాలు జరుగుతున్నట్లు నివేదికలు అందుతున్నాయని, ముఖ్యంగా వృద్ధులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే అధికారిక ఈసీఐ ప్లాట్‌ఫారమ్‌లను సంప్రదించాలని లేదా నేరుగా తమ బూత్ స్థాయి అధికారులను కలవాలని అధికారులు సూచించారు.

# 'పంచధారల' వారసత్వ సంపదకు ముప్పు.. కేంద్రం జోక్యం చేసుకోవాలి

ఆంధ్రప్రదేశ్‌లోని పంచధారల వారసత్వ ప్రాంతం సమీపంలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ వైసీపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వ్యవహారంపై పార్టీ సీనియర్ నేత, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గురువారం రాజ్యసభలో గళం విప్పారు. ప్రాచీన బౌద్ధ స్థూపాలు, ఆలయాలను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, మైనింగ్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. మినరల్స్ సవరణ బిల్లు, 2026పై జరిగిన చర్చలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. పంచధారలలోని బౌద్ధ క్షేత్రం, పురాతన ధర్మలింగేశ్వర స్వామి ఆలయానికి అతి సమీపంలో మైనింగ్ జరుగుతోందని సభ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణం గుండా ప్రవహించే ఐదు సహజ నీటి ప్రవాహాల వల్లే ఆ ప్రాంతానికి 'పంచధారల' అని పేరు వచ్చిందని, ప్రస్తుత మైనింగ్ కార్యకలాపాలతో ఆ పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రాంతంలో వెంటనే తనిఖీలు చేపట్టాలని, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేయాలని, అన్ని అనుమతులను పునఃపరిశీలించాలని కోరారు. ఈ అధ్యయనాలు పూర్తయ్యే వరకు మైనింగ్‌ను నిలిపివేయాలని ఆయన స్పష్టం చేశారు. ఖనిజ సంపద ప్రజలదని, దాని నిర్వహణలో పారదర్శకత ఉండాలని సుబ్బారెడ్డి అన్నారు. మైనింగ్ విధానాలను రూపొందించేటప్పుడు రాష్ట్రాల ఆదాయానికి, స్థానిక ప్రజల జీవనోపాధికి, పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని గుర్తుచేశారు. అంతకుముందు, ఇదే అంశంపై వైసీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, గుమ్మ తనూజారాణి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితరులు ఢిల్లీలో కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మైనింగ్, బ్లాస్టింగ్ వల్ల పవిత్ర జలధారలు దెబ్బతింటున్నాయని అధికారిక విచారణలో తేలినట్లు వారు మంత్రులకు వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రులు.. పది రోజుల్లోగా ఒక కేంద్ర బృందాన్ని పంపి మైనింగ్ కార్యకలాపాలను పరిశీలిస్తామని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంపీ తనూజారాణి తెలిపారు. ఈ వ్యవహారంలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పాత్రపై సీబీఐ విచారణ జరపాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. కింది స్థాయి అధికారులను సస్పెండ్ చేస్తే సరిపోదని, అక్రమ తవ్వకాలకు నిబంధనల ప్రకారం సుమారు రూ. 250 కోట్ల జరిమానా విధించాల్సి ఉందని పేర్కొన్నారు.

# మా సార్ మాకే కావాలి..

ఝార్ఖండ్‌లో తమ అభిమాన హెడ్ మాస్టర్‌ను బదిలీని నిరసిస్తూ విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఫలించింది. విద్యార్థుల పట్టుదల ముందు అధికారులు తలొగ్గక తప్పలేదు. మూడు రోజుల పాటు ఉద్ధృతంగా సాగిన నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను ఉపసంహరించుకుంది.

గఢ్వా జిల్లా కండి బ్లాక్‌లోని ప్రభుత్వ ప్లస్ టూ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ మలయ్ కుమార్ సింగ్‌ను అధికారులు ఇటీవల బదిలీ చేశారు. ఆయన హయాంలో పాఠశాల గణనీయమైన అభివృద్ధి సాధించిందని భావించిన విద్యార్థులు, ఈ బదిలీని తీవ్రంగా వ్యతిరేకించారు. పలువురు విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని కండి–భవనాథ్‌పూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. "మా సార్ మాకే కావాలి" అంటూ నినాదాలు చేస్తూ గంటల తరబడి ట్రాఫిక్‌ను స్తంభింపజేశారు. గురువారం నాడు ఆందోళన మరింత తీవ్రరూపం దాల్చింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులకు నచ్చజెప్పేందుకు వచ్చిన కండి బ్లాక్ చీఫ్ సత్యేంద్ర పాండే, ఒక విద్యార్థిపై చేయి చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఆగ్రహానికి గురైన విద్యార్థులు ఆయన వాహనంపై దాడి చేశారు. రక్షణ కోసం ఆయన సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆశ్రయం

పొందగా, కొందరు విద్యార్థులు స్టేషన్‌పైకి రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి తలకు గాయమైంది. పరిస్థితి తీవ్రతను గమనించిన ఉన్నతాధికారులు రంగంలోకి దిగి విద్యార్థులతో చర్చలు జరిపారు. వారి డిమాండ్‌కు అంగీకరిస్తూ ప్రధానోపాధ్యాయుడు మలయ్ సింగ్ బదిలీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం విద్యార్థులతో ఫోన్‌లో ఆయనను మాట్లాడించడంతో వారు శాంతించి, తమ ఆందోళనను విరమించారు.

# విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

# చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు.

"ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్‌ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

# విజయవాడ–వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసులు.. ప్రారంభించిన రామ్మోహన్

- మొదటి పేజీ తరువాయి

నడపను న్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశంలోని టైర్–2, టైర్–3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ–వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం రాష్ట్ర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ కొత్త సర్వీసు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చనుందన్నారు. మరోవైపు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయం మధ్య సీ ప్లేన్ ప్రాజెక్ట్ కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముందు భారత్‌కు తిరిగి రండి..
## ఆ తర్వాతే పిటిషన్ విచారిస్తాం

- మొదటి పేజీ తరువాయి

తలదాచుకుంటూ, భారతీయ న్యాయస్థానాల పరిధికి లొంగకుండా క్రిమినల్ బాధ్యతల నుంచి తప్పించుకోలేరని కోర్టు వ్యాఖ్యానించింది. విజయ్ మాల్యా వేసిన రెండు వేర్వేరు పిటిషన్లను ఒకేసారి విచారించలేమని, విదేశాల్లో ఉంటూ రాజ్యాంగబద్ధతను సవాలు చేసే పిటిషన్‌ను కొనసాగించలేరని ధర్మాసనం స్పష్టం చేసింది. భారత్‌కు తిరిగి వస్తే సమస్యకు పరిష్కారం చూపుతామని సూచిస్తూ, ఆయన ఎప్పుడు తిరిగి వస్తారో సమయపాలనతో కూడిన వివరణ ఇవ్వాలని ఆదేశించింది. మరోవైపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తరఫున వాదనలు వినిపించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా… పరారీలో ఉన్న నేరస్థులు విచారణకు సహకరించకుండా కోర్టులను ఆశ్రయించకుండా 'పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థుల చట్టం' చట్టంలోని సెక్షన్ 14 అడ్డుకుంటుందని తెలిపారు. బ్రిటన్‌లో మాల్యా అప్పగింత ప్రక్రియ ఆఖరి దశకు చేరుకుందని, ఇలాంటి పిటిషన్లతో ఆ ప్రక్రియకు ఆటంకం కలగకూడదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో, పిటిషన్ వెనక్కి తీసుకుంటారా? లేదా భారత్‌కు తిరిగొచ్చే తేదీని ఖరారు చేస్తారా? అని ప్రశ్నిస్తూ హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

# ఘన స్వాగతం పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 13:**జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశాఖ నగరానికి విచ్చేసిన సందర్భంగా జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌ను వంశీకృష్ణ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం తెలిపారు. జనసేన అధినేతకు స్వాగతం పలికేందుకు పార్టీ నాయకులు, కార్యక ర్తలు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో విమానాశ్రయానికి తరలివచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రమేష్ బాబు, విష్ణుకుమార్ రాజు, విజయ్‌తో పాటు జనసేన పార్టీ సీనియర్ నాయకులు, వీర మహిళలు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన నేపథ్యంలో జనసేన పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ఈ నెల 31లోగా ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ పూర్తి చేయాలి

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 13:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్–2026)లో భాగంగా జారీ చేయాల్సిన నోటీసుల పంపిణీ ప్రక్రియను ఈ నెల 31లోగా వంద శాతం పూర్తి చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ టి. నిషాంతి అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లాలోని ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. నోటీసుల జారీ, పంపిణీ, విచారణ ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులను కేవలం పంపిణీ చేసినట్లు నమోదు చేయకుండా, సంబంధిత ఓటర్లకు నేరుగా అందజేయాలని స్పష్టం చేశారు. ఫారం–6, 7, 8 దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి



పరిష్కరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణతో పాటు ఎన్నికల సంఘం తాజా మార్గదర్శకాలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి జాప్యానికి తావులేకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# వన్యప్రాణుల రక్షణతోనే సుస్థిర అభివృద్ధి



**ఏనుగుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యం**
**ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ**

**విశాఖ, పెన్ పవర్, ఆగస్టు 13:** మానవులు, వన్యప్రాణులు సంఘర్షణ లేకుండా సహజీవనం సాగించే పరిస్థితులే నిజమైన అభివృద్ధికి సూచికలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఏనుగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా విశాఖ పట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

మానవ--ఏనుగు సంఘర్షణలను తగ్గించేందుకు కర్ణాటక సహకారంతో నాలుగు కుంకీ ఏనుగులను రాష్ట్రానికి తీసుకొచ్చి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. వాటి సహకారంతో ఏజెన్సీ ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధిస్తున్నామని, ఇప్పటివరకు 15 కీలక కార్యకలాపాల్లో కుంకీ ఏనుగులు సేవలందించాయని వెల్లడించారు. దీంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం వరకు తగ్గడంతో పాటు పంట నష్టం కూడా గణనీయంగా తగ్గిందన్నారు.

రాష్ట్రంలోనే కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. ఇప్పటికే శిక్షణ పొందిన 'జయంత్' కుంకీ ఏనుగు పార్వతీపురం మన్యం జిల్లాలో సేవలందిస్తోందన్నారు. ప్రతి ఏడాది రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కుంకీ ఏనుగుల ఏర్పాటులో సహకరించిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేలకు కృతజ్ఞతలు తెలిపారు.

'హనుమాన్'తో వేగవంతమైన స్పందన

మానవ--వన్యప్రాణి సంఘర్షణలను సమర్థంగా ఎదుర్కొనేం దుకు 2026 మార్చిలో 'హనుమాన్' ప్రాజెక్టును ప్రారంభిం చినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. వేగవంతమైన స్పందన, సాంకేతిక పరిజ్ఞానం, నష్టం నివారణ చర్యలను సమన్వయం చేస్తూ ప్రాజెక్టును అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా 93 స్పందన వాహనాలు, ఏడు వన్యప్రాణి అంబు లెన్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివర కు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు.వన్యప్రాణుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్య త కాదని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. అటవీ సరిహద్దు ప్రాంతాల్లో రైతులు భయంలే కుండా వ్యవసాయం చేసుకునే పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలు, వన్యప్రాణులు సురక్షితంగా సహజీవనం చేసే భవిష్యత్తును నిర్మించడమే అసలైన విజయమని పేర్కొన్నారు.


'30 జెయింట్ స్టెప్స్' పుస్తకావిష్కరణ

ప్రపంచ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా అటవీ శాఖ రూపొందించిన 'ప్రాజెక్ట్ ఎలిఫెంట్--30 జెయింట్ స్టెప్స్' పుస్తకాన్ని కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. దక్షిణ భారతదేశంలో ఏనుగుల సంరక్షణకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక, వన్యప్రాణి శాస్త్రానికి సంబంధించిన పలు గ్రంథాలను విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కలంకారీ కళాకారులు రూపొందించిన ప్రత్యేక కళాఖండాన్ని కూడా ఆవిష్కరించారు.దేశవ్యాప్తంగా 21,450 పాఠశాలల్లో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏనుగుల సంరక్షణలో ప్రాణత్యాగం చేసిన ఒడిశాకు చెందిన అటవీ శాఖ అధికారి జుగల్ నాయక్‌కు 'గజ గౌరవ్' అవార్డును ప్రదానం చేశారు.

ఏనుగుల పరిరక్షణ, అవగాహన, రక్షణ చర్యల్లో విశేష సేవలందించిన అటవీ శాఖ సిబ్బందిని ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

# కోరపల్లిలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు




పెన్ పవర్
**ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలు..**
**ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయం**

ప్రమాదం అంచున కోరపల్లి గ్రామం

**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, ఆగస్టు 10:**గూడెం కొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ సచివాలయం–-2 పరిధిలోని కోరపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగిపోయి స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. నివాస గృహాలు, పంట పొలాల సమీపంలో విద్యుత్ స్తంభాలు ఒకవైపు వాలిపోయి, విద్యుత్ తీగలు సైతం ప్రమాదకరంగా వేలాడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

**ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని..**

గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పూర్తిగా వాలిపోవడంతో వాటికి ఉన్న విద్యుత్ తీగలు కూడా కిందకు వేలాడుతున్నాయి. పంట పొలాల్లో రైతులు వ్యవసాయ పనులు చేసుకునే సమయంలోనూ, ఇళ్ల వద్ద చిన్నారులు, వృద్ధులు సంచరించే సమయంలోనూ ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ స్తంభాల పరిస్థితి చూస్తుంటే ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పలుమార్లు ఫిర్యాదు చేసినా..**

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాల విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లామని గ్రామస్తులు చెబుతున్నారు.రాతపూర్వకంగా, మౌఖికంగా ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు."ఇళ్లలో ఉన్నా, పొలాల్లో పనులు చేసుకున్నా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవించాల్సి వస్తోంది. అధికారులు స్పందించేలోపే ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు?" అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

**ప్రమాదం జరిగేలోపు స్పందించాలి**

విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే కోరపల్లి గ్రామాన్ని సందర్శించి, ప్రమాదకరంగా ఒరిగిపోయిన స్తంభాలను గుర్తించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా, ముందస్తుగానే ఒరిగిపోయిన స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.గ్రామస్తులు సిహెచ్. జాన్ ప్రసాద్, ఎల్. మల్లేశ్వరరావు, ఎల్. చిన్నబ్బాయి, రాంబాబు, బుజ్జిబాబు తదితరులు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

epaper.penpower.in | 2026-08-11 | Page: 3
For more details, visit epaper.penpower.in

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ పరిధిలోని కోరపల్లి గ్రామంలో ప్రమాదకరంగా ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలపై 'పెన్ పవర్'లో ఆగస్టు 11న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్న ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకురావడంతో విద్యుత్ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల డిప్యూటీ ఈఈ సన్నీ రాంబాబు,ఏఈ సూరిబాబు అధికారులు చర్యలు చేపట్టారు.గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో గురువారం కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.

దీంతో గత కొంతకాలంగా భయాందోళనకు గురైన గ్రామస్తులకు ఊరట లభించింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో 'పెన్ పవర్' చేస్తున్న కృషికి గ్రామస్థులు అభినందనలు తెలిపారు. సమస్యపై స్పందించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# కురుపాంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ






- **250 అడుగుల భారీ జాతీయ జెండాతో హోరెత్తిన రావాడ జంక్షన్**
- **ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డా.శ్రీఎన్.ప్రభాకర రెడ్డి,ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి**
- **సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటోలు దిగి దేశభక్తి చాటుకున్న కలెక్టర్,నేతలు**

**కురుపాం,ఆగష్టు 13 పెన్ పవర్.**దేశ వ్యాప్తంగా జరగనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మరియు 'వందేమాతరం'గీతం 150 ఏళ్లు పూర్తిచేసుకున్న చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోగురువారం నాడు'హర్ ఘర్ తిరంగ'ర్యాలీ అత్యంత వైభవంగా సాగింది.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి,రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు.కురుపాం మండలం రావాడ జంక్షన్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు సాగిన ఈ భారీ ప్రదర్శనలో 250 అడుగుల సుదీర్ఘ జాతీయ జెండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రజాప్రతినిధులు,అధికారులు,విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు త్రివర్ణ పతాకాలను చేతబూని "భారత్ మాతాకీ జై" "వందేమాతరం"నినాదాలతో పరిసరాలను మార్మోగించారు.కలెక్టర్ మరియు ప్రభుత్వ విప్ స్వయంగా సైకిళ్లపై మరియు పాదయాత్రగా సాగుతూ పౌరులలో దేశభక్తి స్ఫూర్తిని నింపారు.ర్యాలీ ముగింపు స్థానమైన తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక'హర్ ఘర్ తిరంగ'సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి,ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మరియు ఇతర అధికారులు ఫోటోలు దిగి సందడి చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడానికి,జాతీయ సమైక్యతను చాటడానికి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి'హర్ ఘర్ తిరంగ'కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా,మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు,పాఠశాల విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## స్థానిక ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేద్దాం..!

- హుకుంపేట మండల కేంద్రంలో వైసిపి అత్యవసర సమావేశం




**హుకుంపేట పెన్ పవర్ ఆగస్టు 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం కేంద్రంలో వైసీపీ అత్యవసర సమావేశం, నిర్వహించారు. హుకుంపేట వైసీపీ మండల అధ్యక్షులు పాంగి. అనిల్ ఆధ్వర్యంలో దీనికి ముఖ్య ఉదేశ్యం కొత్త ఓటర్ జాబితల లిస్ట్ పంపిణీ చేయడం జరిగింది హుకుంపేట మండలం 33 పంచాయతీ బి ఎల్ ఏ లకు ఇవ్వడం జరిగిందిఅని అయన అన్నారు హుకుంపేట వైసీపీ కార్యాలయంలో జస్ట్ డేమో

ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షులు రేగం శివరామ కృష్ణ హుకుంపేట మండల బి ఎల్ ఏ అధ్యక్షులు రేగం. రమేష్ మాజీ సర్పంచ్ కొంతిలి, ఉపాధ్యక్షులు కాకరి. వెంకటరావు గోమాంగి చినేశ్వరరావు.గండేరు. చిన్న సత్యం,మరియు 33పంచాయతీ బి ఎల్ ఏ కార్యకర్తలు పాల్గొన్నారు

## బీటీఎం రోడ్డు పనులకు శంకుస్థాపన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగష్టు 13**: మండలంలోని లకవరపుపేట పంచాయతీ కే.కోడిసింగి గ్రామంలో కోలని--చెలకవీధి రహదారి నిర్మాణానికి కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. వీఎస్బీ--రామ్‌జీ పథకం నిధుల నుంచి సుమారు రూ.కోటి వ్యయంతో డబుల్ బీటీఎం రహదారిని నిర్మించనున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.ఏళ్లుగా రహదారి అధ్వానంగా ఉండటంతో గ్రామస్థులు, ముఖ్యంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాల్లో రహదారులు, తాగునీరు, సాగునీరు, గృహ నిర్మాణం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోత్తూరు కొండలరావు,వైస్ ఎంపీపీ సప్పుగెడ్డ ఆనంద్, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎం.నూకరాజు,బీజేపీ నాయకులు బోండ్ల చిరంజీవి,జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, దేవరపల్లి మాజీ సర్పంచ్ బుజ్జిబాబు,నాయకులు దేశగిరి గోవిందరావు,శేట్టి రామారావు,కోటిపడాల్, గబులంగి నాగేష్,రాజులమ్మ, కొండబాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో విజ్ఞాన్ దువ్వాడ విద్యార్థుల ప్రతిభ







**కూర్మన్న పాలెం :పెన్ పవర్ , ఆగస్టు 13** దువ్వాడలోని విజ్ఞాన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటానమస్ విద్యార్థులు తిరుపతిలో నిర్వహించిన ఏపీ రాష్ట్ర అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించి సంస్థకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చారు. ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల, పోటీతత్వ స్ఫూర్తితో విద్యార్థులు వివిధ అథ్లెటిక్స్ విభాగాల్లో విశేష ప్రతిభను ప్రదర్శించారు.పీ. రవి తేజ షాట్‌పుట్ విభాగంలో కాంస్య పతకం సాధించగా, కె. థాన్సీ తాన్వి 4ఐ100 మీటర్ల రిలేలో బంగారు పతకం సాధించారు. కె. శ్రీ లక్ష్మీ తులసి హైజంప్ విభాగంలో వెండి పతకం సాధించి మరో విజయాన్ని నమోదు చేశారు. విద్యార్థుల ఈ విజయాలు కఠోర శ్రమ, అంకితభావం, క్రమశిక్షణ మరియు క్రీడల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా నిలిచాయి.ఈ సందర్భంగా డా. జె. సుధాకర్, ప్రిన్సిపాల్, మరియు డా. వి. మధుసూదనరావు, రెక్టర్, విద్యార్థులను అభినందిస్తూ, వారి అంకితభావం, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రశంసించారు. భవిష్యత్ పోటీల్లో మరింత ఉన్నత ప్రతిభను కనబరిచి సంస్థకు మరింత గుర్తింపు తీసుకురావాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు.

విజ్ఞాన్ ఫిజికల్ డైరెక్టర్లు డా. పి. ఎస్. వి. రమణ, చ. రాంబాబు, జి. వంశీకృష్ణ, జె. ప్రశాంత్, అధ్యాపకులు మరియు విద్యార్థులు కూడా విజేతలను అభినందించారు.

క్రీడా ప్రతిభతో పాటు విద్యా ప్రగతికి సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విజ్ఞాన్ దువ్వాడ నిరంతరం కృషి చేస్తోంది. విద్యార్థులు పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించేలా సంస్థ వివిధ అవకాశాలను కల్పిస్తోంది. తద్వారా విద్యార్థుల్లో జట్టుస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పోటీతత్వ స్ఫూర్తి మరియు సమగ్ర వ్యక్తిత్వ వికాసం పెంపొందుతున్నాయి. అథ్లెటిక్స్‌లో విద్యార్థులు సాధించిన ఈ విజయం తోటి విద్యార్థులకు అన్ని రంగాల్లోనూ ప్రతిభను సాధించేందుకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

## గుంటసీమలో పశువైద్య శిబిరం.

**డంబ్రిగుడ,పెన్ పవర్ ఆగష్టు,13**: మండలంలోని గుంటసీమలో వైద్యాధికారిణి రాజశ్రీ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూగజీవాలకు ఎల్ ఎస్ డి వ్యాక్సినేషన్లు వేశారు. అనంతరం పశు వైద్యాధికారిని రాజశ్రీ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్లో మూగజీవులకు వ్యాధులు వ్యాప్తి చేయకుండా ఉండేందుకుగాను ముందస్తుగా ఈ వ్యాక్సిన్లు వేస్తున్నామన్నారు. ఈ శిబిరాన్ని ప్రతి ఒక్క రైతులు సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఓ దుర్గ ప్రసన్న , ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష

**రూ.5 వేల జరిమానా.. చెల్లించకపోతే అదనంగా నాలుగు నెలల జైలు**

**పోలీసుల సమర్థవంతమైన దర్యాప్తుతో నిందితుడికి శిక్ష**

**గాజువాక :పెన్ పవర్ ,ఆగస్టు 13 :**హత్యాయత్నం కేసులో నిందితుడు నారికేళం రాంబాబుకు 8 వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయస్థానం, గాజువాక నాలుగేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశించింది.

గాజువాక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన క్రైం నంబర్ 174/2024 భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 307 కింద నమోదైన హత్యాయత్నం కేసుకు సంబంధించి ఎస్.సీ. మూ. నంబర్ 132/2024లో 8 వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి ఎస్. కవిత గురువారం, ఆగస్టు 13, 2026న తీర్పును ఇచ్చారు .

పోలీస్ లు తెలిపిన కేసు వివరాలు విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం గోల్జం గ్రామానికి చెందిన లంకా గణపతి వయసు 30 సవంత్సరాలు జీవనోపాధి కోసం విశాఖపట్నంలోని శ్రీనగర్ ప్రాంతంలో ఉన్న దక్షా షిప్పింగ్ కంపెనీకి చెందిన యజమాని వెంకట్ వద్ద లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఏపీ 39 యూపీ 6246 నంబర్ గల లారీకి గణపతితో పాటు నారికేళం రాంబాబు ప్రత్యామ్నాయంగా డ్రైవర్లుగా పనిచేసేవారు. ఐదు రోజులు విధులు నిర్వహించిన అనంతరం ఐదు రోజులు విశ్రాంతి తీసుకునే విధంగా వారి విధులు ఉండేవని , గణపతి 17 మార్చి 2024న విధుల్లో చేరి 24 మార్చిన విధుల నుంచి దిగాల్సి ఉండగా, తన స్థానంలో విధుల్లోకి రావాల్సిన నారికేళం రాంబాబును ఫోన్ ద్వారా సంప్రదించాడు. అయితే రాంబాబు విధులకు వచ్చేందుకు నిరాకరించడంతో ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు దుర్భాషలాడుతూ తాను రానని, ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ గణపతితో గొడవపడ్డాడని ,.

ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న రాంబాబు మరుసటి రోజు, 25 మార్చి 2024న ఉదయం సుమారు 10.30 గంటల సమయంలో గణపతిపై దాడికి పాల్పడ్డాడు. ముందస్తు ఉద్దేశంతో తన వద్ద కత్తిని తీసుకుని వచ్చి గణపతితో కావాలనే గొడవ పెట్టుకున్నాడు. అనంతరం చంపాలనే ఉద్దేశంతో గణపతి గుండె భాగంతో పాటు చేతి, భుజంపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు.చుట్టుపక్కల వారి సహాయంతో గాయపడిన గణపతిని సమీపంలోని ఆర్‌కే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుడి వైద్య–చట్టపరమైన ప్రకటన ఆధారంగా గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు .

దర్యాప్తులో పోలీసులు సేకరించిన సాక్ష్యాధారాలు, వైద్య ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను న్యాయస్థానంలో సమర్థవంతంగా ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ సమర్పించిన ఆధారాల ఆధారంగా నిందితుడిపై మోపిన అభియోగాలు రుజువైనట్లు న్యాయస్థానం నిర్ధారించింది.

నిందితుడు నారికేళం రాంబాబుకు నాలుగేళ్ల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా నాలుగు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది .

ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు నిర్వహించిన గాజువాక సబ్–ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాసరావు, ప్రభుత్వ తరఫున వాదనలు వినిపించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోతిన రాంబాబు,



సాక్షుల హాజరు, కోర్టు రికార్డుల నిర్వహణ, కేసు పర్యవేక్షణతో పాటు ప్రాసిక్యూషన్ సమన్వయంలో విశేష కృషి చేసిన సీఎంఎస్ హెడ్ కానిస్టేబుల్ బి. నరసింహమూర్తి, ప్రాసెస్ కానిస్టేబుల్ కె. ప్రకాష్ నిందితుడికి శిక్ష పడటంలో కీలకంగా నిలిచిందని పోలీసులు తెలిపారు .

## ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి భౌతిక దేహాన్ని నివాళి - ఎంఈఓ

- ప్రభుత్వం అందించే 25 వేల రూపాయల అంత్యక్రియల ఖర్చు కుటుంబానికి అందజేత.
- మండల విద్యాశాఖ అధికారి కోడా కృష్ణమూర్తి.
- ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు బజ్జంగి బాబురావు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 13.**మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ, కుజబంగి ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న సమరెడ్డి కృష్ణమూర్తి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కృష్ణమూర్తి మరణ వార్త విన్న ముంచంగిపుట్టు మండల విద్యాశాఖ అధికారి కోడా కృష్ణమూర్తి, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు బజ్జంగి బాబురావు పెదబయలు మండలంలోని ఉపాధ్యాయుని యొక్క స్వగ్రామం సీకరిలో వెళ్ళి కృష్ణమూర్తి యొక్క భౌతిక దేహాన్ని నివాళులర్పించారు. ప్రభుత్వం అందిస్తున్న దహన సంస్కారాల ఖర్చు 25 వేల రూపాయలు కుటుంబాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కృష్ణమూర్తి మంచి మనస్సు, మృదు స్వభావి గల ఉపాధ్యాయుడనీ, ఆయన మృతి చెందడం చాలా బాధాకరమని, ఆయన మరణం కుటుంబానికి తీరని లోటనీ అన్నారు. మృతి చెందిన కృష్ణమూర్తి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యపరచారు. ఉపాధ్యాయుని అంతిమయాత్రలో వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కే సూర్యనారాయణ, తిరుపతి సింహాచలం, అనిల్ కుమార్, బంధువులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కోతకు గురైన రోడ్డు - పొంచి ఉన్న ప్రమాదం

- డుడుమ్మ రోడ్డు లబ్బురు సమీపంలో ఘటన.
- అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలి.
- మండల వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి. ఎంపిటిసి బజ్జంగి కమల.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఆగస్టు 13.**మండలంలోని జోలపుట్టు పంచాయితీ లబ్బురు గ్రామ సమీపంలో డుడుమ రహదారి వద్ద ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారాయనీ మండల వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, స్థానిక ఎంపిటిసి బజ్జంగి కమల అన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ.. అధికారులకు సమీప గ్రామస్తులు సమాచారం అందించిన గాని ఎవరు పట్టించుకోలేదని అన్నారు. డుడుమ రహదారి కల్వర్టు కోతకు గురై దాదాపు నెల రోజుల గడుస్తున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. గతంలో ఇదే కల్వర్ట్ సరిగ్గా మరమ్మత్తు చేయకపోవడం బట్టే ప్రతి ఏడది వర్షాకాలంలో తరచుగా మట్టి కొట్టుకుపోతుందన్నారు. మరమ్మతులు చేపట్టకపోతే రోడ్డు పడిపోయే ప్రమాదం ఉందని, డుడుమ్మ ప్రధాన రహదారి కాబట్టి తక్షణమే బ్రిడ్జి నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ




కార్యక్రమంలో సోమేశ్, దొంబో, జీవన్ తదితరులు పాల్గొన్నారు

## "జాప్" నర్సీపట్నం ప్రెస్ క్లబ్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**అధ్యక్షులుగా లగుడు వెంకటరమణ**

**ప్రధాన కార్యదర్శిగా రుత్తల వెంకటరమణ**

**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగష్టు 13) :** జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్ ) నర్సీపట్నం ప్రెస్ క్లబ్, మరియు ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఐదురోడ్ల జంక్షన్ లోని ఉమా నారాయణ ఫంక్షన్ హాల్ లో జాప్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి వేణు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ప్రకటించిన కార్య వర్గాన్ని సభ్యులు కరతాళధ్వనులతో ఆమోదించారు. ప్రెస్ క్లబ్ గౌరవ సలహాదారుగా లంక శివకుమార్ (పెన్ పవర్ స్టాఫ్ రిపోర్టర్), గౌరవ అధ్యక్షులుగా పులిగా మురళి ( పి ఆర్ ఎం న్యూస్ ), అధ్యక్షులుగా లగుడు వెంకటరమణ ( ఎల్ వి ఆర్ న్యూస్ ), ఉపాధ్యక్షులుగా రమణ (గొలుగొండ ), అనిమిరెడ్డి అప్పలనాయుడు (మాకవరపాలెం), జిల్లా వాణి రమణ – (నాతవరం), ప్రధాన కార్యదర్శిగా రుత్తల వెంకట రమణ (మాకవరపాలెం), కార్యదర్శులుగా రామారావు (గొలుగొండ ) కోనేటి రంగబాబు (కోట ఉరట్ల), కోశాధికారిగా కడిమి శెట్టి మాణిక్యాలరావు ( ఎన్ టీవీ తాతాజీ ), కార్యవర్గ సభ్యులుగా రుత్తల తాతాజి (మాకవరపాలెం ), లెక్కల రమేష్ (మాకవరపాలెం), ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులుగా ఎం ఏ రాజు ( టీవీ 8 ), అధ్యక్షులుగా కె. జగదీష్ ( మహా టీవీ), ఉపాధ్యక్షులుగా పల్లా గోవిందరావు (6టీవీ), వరహాలబాబు (గొలుగొండ ), రహీమ్ ( బిగ్ టీవీ) ప్రధాన కార్యదర్శిగా బొడ్డు శివ (నాతవరం టీవీ7 ), కార్యదర్శులుగా బొడ్డు మహేశ్వరరావు ( మహేష్) (కే.టీవీ), పొట్ల రాజేష్ ( 33 టీవీ , రోలుగుంట ), కార్యవర్గ సభ్యులుగా రమేష్ ( మాకవరపాలెం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి కార్యవర్గం సమావేశం కావాలని, సంఘాన్ని మండలాల వారీగా మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం తీర్మానించింది. ఈ కార్యక్రమంలో జాప్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోసూరి రామకృష్ణ, సీనియర్ పాత్రికేయులు జక్కు నాయుడు, మాకవరపాలెం కోటిబాబు, పోలుపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు సిల్వర్ మొక్కల పంపిణీ



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 12** :అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దేవరపల్లి పంచాయతీ పరిధిలోని ఈతరొబ్బలు, లక్కవరం, సాగులు, చీడిగొంది గ్రామాల్లో వి బి జి - రాంజీ ఆధ్వర్యంలో రైతులకు సిల్వర్ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈతరొబ్బలు 11 ఎకరాలు, లక్కవరం 14 ఎకరాలు, సాగులు 19 ఎకరాలు, చీడిగొంది 28 ఎకరాలు.. మొత్తం 72 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఎకరం చొప్పున సిల్వర్ మొక్కలను అందజేశారు. మొత్తం 676 మొక్కలను రైతులకు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.మండల బీజేపీ అధ్యక్షుడు కాకూరు శేఖర్ రైతులకు మొక్కలను అందజేశారు. రైతులు సిల్వర్ మొక్కలను సద్వినియోగం చేసుకుని తమ భూముల్లో సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు.కార్యక్రమంలో దేవరపల్లి పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ కె. విష్ణుమూర్తి, పి. చిన్నతల్లితో పాటు ఆయా గ్రామాల రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వీర జవాన్ల కుటుంబాలకు కుటుంబాలకు అండగా రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్




**నర్సీపట్నం, పెన్ పవర్ (ఆగస్ట్ 13):**రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎంపీగా తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను, దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం ఆయన విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును ఆయన భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కు అందజేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందులో భాగంగానే తాను ఈ చిన్న సాయం చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు. పదవి చేపట్టిన వెంటనే తన తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం ఇచ్చిన విజయ్ దాతృత్వాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు.

# కాఫీ తోటల్లో యాలకుల సాగుకు అనుకూలం

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 13**:కాఫీ తోటల్లోని నీడను వినియోగించుకుని యాలకుల సాగు చేపట్టవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ నిశాంతి ఆదేశాల మేరకు యాలకుల సాగుకు గూడెం కొత్తవీధి మండలంలో ఉన్న అనుకూల పరిస్థితులను పరిశీలించేందుకు కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన శాస్త్రవేత్తలు ఎస్. కుమార్, కే.ఏ. సాధు, జిల్లా సుగంధ ద్రవ్యాల మండలి అధికారి బి. కళ్యాణి మాడెం, చిన్నజాడుమూరు గ్రామాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా వారు యాలకుల సాగుకు అనువైన వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, కాఫీ తోటల్లో ఉన్న నీడను పరిశీలించారు. కాఫీ తోటల్లోని నీడను సద్వినియోగం చేసుకుని యాలకుల సాగు చేపట్టేందుకు అవకాశం ఉందని తెలిపారు. సేంద్రియ పద్ధతుల్లో యాలకులను సాగు చేయడం ద్వారా గిరిజన రైతులకు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.మండలంలో యాలకుల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సాగు విధానాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్. సురేష్, ఏపీసీఎన్ఎఫ్ విభాగం ఇన్‌చార్జి వెంకటరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు ఉషామణి, గ్రామ ఉద్యానవన సహాయకుడు కృష్ణ, రైతులు పాల్గొన్నారు.






## కార్మిక సంఘంకు సామాజిక భవనం కై జోనల్ కమిషనర్ జెడ్స కి వినతి పత్రం



**కూర్మన్న పాలెం :పెన్ పవర్ ,ఆగస్టు 13**
పారిశ్రామిక ప్రాంతం గాజువాక ముఠాకార్మిక సంఘం నాయకులకు గతంలో రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు సామాజిక భవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు . ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గాజువాక ఎమ్మార్వో ఆఫీస్ వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని జెసిపితో సదును చేశారు . ఆ స్థలంలో సామాజిక భవనం ఏర్పాటు చేయాలని గాజువాక జోనల్ కమిషనర్ కి మాజీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం చేతుల మెదగా వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి ఆ స్థలంలో వారికి సామాజిక భవనం నిర్మించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక ముఠా కార్మిక సంఘం సభ్యులు ఆనంద్, దేముడు,తాతా రావు పాల్గొన్నారు .

## టిడిపి ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి చెప్పండి...!

- స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయండి...
- కార్యకర్తల సమావేశంలో టీడీపీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి .



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 13:** రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఇంటింటికి వెళ్లాలని చేసిన మంచిని ప్రతి ఇంటిలోనూ చెప్పాలని టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. కొయ్యూరు జడ్పీ గెస్ట్ హౌస్ లో గురువారం మండల కేడర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా గిరిజన ప్రజలకు మేలు చేసిన విషయాన్ని ప్రచారం చేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలను అందించగలిగిందని ఆమె స్పష్టం చేశారు. అలాగే రోడ్లు, సి సి రోడ్లు,డ్రైనేజీలు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని ఇంటింటా ప్రచారం చేయాలని తద్వారా సులభంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి దోహద పడుతుందని టీడీపీ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు కాకూరి చందర్రావు,ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, పిఏసీఎస్ అధ్యక్షులు సంభశివరావు,నారాయణమూర్తి, బంటు లక్ష్మణ్, జంపా వెంకటరమణ, సురేష్ పట్నాయక్, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గన్నెల పి హెచ్ సి ని సందర్శించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ



**అరకులోయ పెన్ పవర్ ఆగస్టు 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ గురువారం అరకు వ్యాలీ మండలంలోని గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి హెచ్ సి లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.
అనంతరం పి హెచ్ సి వైద్యులు, సిబ్బందితో జాయింట్ కలెక్టర్ సమావేశమై, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, మందుల లభ్యత, వైద్య సేవలు, సిబ్బంది విధులు తదితర అంశాలపై ఆరా తీశారు. గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎదురవుతున్న ఇబ్బందులను సిబ్బందిని అడిగి తెలుసుకున్న జాయింట్ కలెక్టర్, అవసరమైన అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## మండల కేంద్రంలో ఘనంగా హర్ ఘర్ తిరంగ ర్యాలీ.



**కొయ్యూరు,పెన్ పవర్ ఆగస్టు 13:** స్వసంత్రశీ వచ్చి 79 సంవత్సరాలను పూర్తి చేసుకుని 80 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న నేపథ్యంలో కొయ్యూరు మండల కేంద్రమైన రాజేంద్రపాలెంలో ఎంపీడీవో జీడివి ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు పలువురు అధికార్ల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తో ఈ 80 స్వసంత్ర వేడుకలను పురస్కరించుకుని భారీ సంఖ్యలో పాల్గొని ర్యాలీ జరిపారు. ఆగస్టు 15 న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ స్వసంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని ఈ ర్యాలీ లో పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు,కార్యదర్శి తలుపుల నాయుడు, పలువురు కార్యదర్శులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

<u>వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్</u>



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగస్టు 13:** పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని వెంటనే నిలిపివేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్ హెచ్చరించారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పొగిడారంటూ ఇటీవల సోషల్ మీడియాలో ఓ వీడియోను ప్రచారం చేస్తున్నారని తెలిపారు.ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్‌ను ప్రశంసించినట్లు ప్రచారం చేస్తున్న వారు అందుకు సంబంధించిన పూర్తి వీడియో, ఆడియో ఆధారాలను బయటపెట్టాలని బొబ్బిలి లక్ష్మణ్ డిమాండ్ చేశారు.ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు చేస్తూ ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు.విశ్వేశ్వరరాజు ఇప్పటికీ, ఎప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు.ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని బొబ్బిలి లక్ష్మణ్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ఆధారాలు లేని ప్రచారాలకు స్వస్తి పలకాలని ఆయన కోరారు.

## జిల్లా స్థాయి పోటీల్లో బెహరా పాలిటెక్నిక్ విద్యార్థుల సత్తా

<u>**కవిత్వం, నాటికలో ద్వితీయ స్థానం**</u>
<u>**జానపద నృత్యంలో తృతీయ స్థానం**</u>

**పెందుర్తి, పెన్ పవర్, ఆగస్టు 13 :** జిల్లా స్థాయి పోటీల్లో బెహరా పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభను చాటుకుని కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నగరంలో "మాదక ద్రవ్యాల నిర్మూలన -- వికసిత భారత్" అనే అంశంపై వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో బెహరా పాలిటెక్నిక్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకత, కళా ప్రతిభను ప్రదర్శించారు. మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై యువతలో అవగాహన కల్పించడంతో పాటు, దేశాభివృద్ధిలో యువత పాత్రను చాటిచెప్పే విధంగా విద్యార్థులు తమ ప్రదర్శనలు ఇచ్చారు. కవిత్వం విభాగంలో బెహరా పాలిటెక్నిక్ విద్యార్థులు ద్వితీయ స్థానం, నాటిక విభాగంలో ద్వితీయ స్థానం, జానపద నృత్యం విభాగంలో తృతీయ స్థానం సాధించి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభను నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను వై భరత్ డీడీ మహేశ్వరరావు అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థులు సాధించిన విజయంపై బెహరా విద్యాసంస్థల సెక్రటరీ డా. బెహరా చైతన్య హర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లోనూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో మూడు విభాగాల్లో బహుమతులు సాధించడం బెహరా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని కళాశాల ప్రతినిధులు పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెహరా విద్యాసంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## పోస్టల్ సేవలపై అవగాహన ర్యాలీ.




**డుంబ్రిగూడ, పెన్ పవర్ ఆగస్టు 13:** పోస్టల్ శాఖ ప్రజలకు అందిస్తున్న పలు రకాల సేవలపై జయహో బీమా సంకల్పం 3.0 నినాదంతో మండల కేంద్రంలో గురువారం పోస్టల్;సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈనెల 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు ఈ నినాదంతో అనకాపల్లి పోస్టల్ శాఖ సూపర్డెంట్ ఆఫ్ శ్రీనివాసరావు మేరకు; అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు అరకు సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ కిషోర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ శ్రీ వెంకటరావు, సూపర్ ఎంపిటిసి సింహాద్రి, పిఎ వి ఎస్ నారాయణ ఎం వో గోపాల్, పోస్టల్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల డిమాండ్లు పరిష్కరించాకే ప్రాజెక్టు పనులు చేపట్టాలి



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 13:**నూతనంగా నిర్మించనున్న పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు పనులను ప్రారంభించే ముందు ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులుగా మారనున్న కుటుంబాల న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని దండకారణ్య విమోచన సమితి (డీఎల్‌ఓ) నాయకులు డిమాండ్ చేశారు. సీలేరు ప్రాంతంలో ఆగస్టు 15న ప్రాజెక్టుకు భూమిపూజ నిర్వహించనున్నట్లు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ రాజారావు ప్రకటించిన నేపథ్యంలో వారు ఈ డిమాండ్ చేశారు.ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులుగా మారే కుటుంబాలకు ఇంటికి ఇల్లు, భూమికి భూమి, ప్రతి కుటుంబానికి ఉపాధి లేదా ఉద్యోగ అవకాశం కల్పించాలని డీఎల్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు మార్కు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ కోరారు. పునరావాసం, పరిహారం, భూమి, ఉపాధి, ఇతర హక్కులపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించి, దానిని అమలు చేసిన తర్వాతే భూమిపూజ, ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టాలని తెలిపారు.నిర్వాసితుల పునరావాసం, పరిహారం, ఉపాధి, భూమి తదితర అంశాలపై స్పష్టమైన హామీలు ఇవ్వకుండా పనులు ప్రారంభిస్తే ప్రజల్లో ఆందోళనలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఏపీ జెన్‌కో అధికారులు ముందుగా నిర్వాసిత గ్రామాల ప్రజలతో ప్రత్యక్షంగా చర్చలు నిర్వహించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.నిర్వాసితులకు న్యాయబద్ధమైన, ఆమోదయోగ్యమైన పునరావాస పరిష్కారం చూపిన తర్వాతే ప్రాజెక్టు పనులను ప్రారంభించాలని డీఎల్‌ఓ నాయకులు స్పష్టం చేశారు. 'ముందుగా నిర్వాసితుల హక్కులు.. ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు' అనే విధానంతో ప్రభుత్వం ముందుకు సాగాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో డీఎల్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు మార్కు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్‌తో పాటు సీలేరు ప్రాంతంలోని మూడు గ్రామాలకు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్

- రూ.50 లక్షలతో మోడల్ పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఎల్జీ ఇండియా సిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం
- ప్రభావిత ప్రాంతాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు





**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 13** : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం వెంకటాపురంలో ఎల్జీ ఇండియా సిఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. పరిశ్రమలు తమ సిఎస్ ఆర్ నిధులను స్థానిక ప్రజల విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించడం అభినందనీయమన్నారు. అనంతరం వెంకటాపురంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎల్జీ ఇండియా జూ= నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గణబాబు శంకుస్థాపన చేశారు. పాఠశాలలో ఆధునిక వంటగది, అదనపు తరగతి గదులు, శౌచాలయాలు, చిన్నారుల కోసం ఆట స్థలం తదితర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే పాఠశాల మరింత సుందరంగా, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంతో రూపుదిద్దుకోనుందని అధికారులు తెలిపారు. వెంకటాపురంలో గతంలో చోటుచేసుకున్న సంఘటనల అనంతరం స్థానిక ప్రజల విద్యా, వైద్య, సామాజిక అవసరాలను గుర్తించి ఎల్జీ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని గణబాబు అన్నారు. రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్న ఈ పాఠశాల పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎల్జీ ప్రభావిత ప్రాంతాల పరిధిలోని ఏడు గ్రామాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను అందించనున్నట్లు ఎల్జీ ఇండియా జూ= ఫౌండేషన్ ప్రతినిధులు ప్రకటించారు. బిపిఎల్ కుటుంబాలకు చెందిన అర్హులైన విద్యార్థులకు ఈ ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డిప్లొమా, గ్రాడ్యుయేషన్, ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం ద్వారా ఉన్నత విద్యకు ఆర్థికంగా చేయూతనివ్వనున్నట్లు వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని ఎమ్మెల్యే గణబాబు స్వాగతిస్తూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేయకుండా ఇలాంటి స్కాలర్‌షిప్‌లు ఉపయోగపడతాయని అన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా సంస్థ సహకారం అందించాలని కోరారు. రాబోయే రోజుల్లో గోపాలపట్నం ఆసుపత్రి అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం వంటి పలు సామాజిక అభివృద్ధి కార్యక్రమాలకు సిఎస్ఆర్ నిధుల ద్వారా సహకారం అందించేందుకు ఎల్జీ ఇండియా జూ= ఫౌండేషన్ సిద్ధంగా ఉందని సంస్థ ప్రతినిధులు వెల్లడించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే ప్రాంతీయ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని గణబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్జీ ఇండియా సిఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎం. గిరిజా శంకర్, మిస్టర్ సుంగ్ యున్ కిమ్, జోనల్ కమిషనర్ హేమావతి, వార్డు ఇన్‌చార్జి దాడి రమేష్ నాయుడు, ప్రెసిడెంట్ కంపర ఆనంద్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 91వ వార్డులో రూ.55.90 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బంగారమ్మ టెంపుల్ రోడ్--డ్రెయిన్ మౌలిక వసతుల పనులకు శ్రీకారం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 13** : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ఆదేశాల మేరకు 91వ వార్డులో రూ.55.90 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ 91వ వార్డులోని బంగారమ్మ టెంపుల్ రోడ్‌లో రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు సుమారు రూ.19.90 లక్షలు కేటాయించారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి, వర్షపు నీటి పారుదల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు తెలిపారు. అదేవిధంగా జయప్రకాష్‌నగర్‌లో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన జరిగింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు నారీపిన్ని సత్తిరాజు, నరవ అనూష, సెక్రటరీ పట్నాల అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నామని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన బెహరా భాస్కరరావు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 13 :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ను జనసేన పార్టీ నాయకుడు బెహరా భాస్కరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ, సామాజిక అంశాలపై ఇరువురి మధ్య స్నేహపూర్వకంగా చర్చ జరిగినట్లు సమాచారం. జనసేన పార్టీ బలోపేతం, పార్టీ కార్యకర్తల సమస్యలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై భాస్కరరావు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజలకు మెరుగైన పాలన, అభివృద్ధి, సంక్షేమం అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ వివరించినట్లు సమాచారం. పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని భాస్కరరావు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ మర్యాదపూర్వక



భేటీ జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరంపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు సమాచారం.

# జాతీయ అవార్డు గ్రహీత పోతుల అరుణ్ దేవ్‌కు ఘన సత్కారం







- 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ బాల నటుడిగా గుర్తింపు
- '35 చిన్న కథ కాదు' చిత్రానికి ఉత్తమ బాలల చిత్రం అవార్డు
- గోపాలపట్నం కళా సేవా పీఠం అభినందనలు

**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 13 :** 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ బాల నటుడిగా ఎంపికైన పోతుల అరుణ్ దేవ్‌కు కళా సేవా పీఠం ఆధ్వర్యంలో ఘనంగా సత్కారం నిర్వహించారు. '35 చిన్న కథ కాదు' చిత్రంలో బాల నటుడిగా అరుణ్ దేవ్ కనబరిచిన ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం తెలుగువారందరికీ గర్వకారణమని పలువురు వక్తలు అభినందించారు. కళా సేవా పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు నందవరపు మాట్లాడుతూ.. లెక్కల్లో '0' మార్కులు సాధించిన ఓ తెలుగు పిల్లాడి కథగా తెరకెక్కిన '35 చిన్న కథ కాదు' చిత్రం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంగా ఎంపికై '100 మార్కులు' సాధించిందన్నారు. పిల్లల తెలివితేటలను కేవలం మార్కులతోనే అంచనా వేయకూడదనే చక్కటి సందేశాన్ని ఈ చిత్రం సమాజానికి అందించిందన్నారు. నేటి పరిస్థితుల్లో ఈ సందేశం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కళా సేవా పీఠం గౌరవ అధ్యక్షులు చందు సుబ్బారావు మాట్లాడుతూ.. సుమారు 30 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తెలుగు సినిమా జాతీయ అవార్డుల్లో మరోసారి తన సత్తా చాటిందన్నారు. '35 చిన్న కథ కాదు' చిత్రం పిల్లల మనస్తత్వాన్ని, చదువులో పసి మనసులు ఎదుర్కొనే సవాళ్లను చర్చించిందన్నారు. పిల్లలను అర్థం చేసుకోవడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అవగాహన లోపాలను కూడా ఈ సినిమా చక్కగా చూపించిందని తెలిపారు. కళా సేవా పీఠం అధ్యక్షులు గౌరపల్లి బంగార్రాజు మాట్లాడుతూ.. '35 చిన్న కథ కాదు' చిత్రంలో నటించిన పోతుల అరుణ్ దేవ్‌కు గతంలో తెలంగాణ ప్రభుత్వం 2024 సంవత్సరానికి గద్దర్ అవార్డుతో సత్కరించిందని గుర్తుచేశారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో ఉత్తమ బాల నటుడిగా అవార్డు ఎంపిక కావడం అరుణ్ దేవ్ ప్రతిభకు నిదర్శనమని, తెలుగువారందరికీ గర్వకారణమని అన్నారు. కళా సేవా పీఠం మాజీ అధ్యక్షులు గోరకల రామదాసు మాట్లాడుతూ.. 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తొమ్మిది మంది తెలుగువారికి వివిధ విభాగాల్లో జాతీయ స్థాయి పురస్కారాలు లభించడం అభినందనీయమన్నారు. అవార్డులు సాధించిన ప్రతి ఒక్కరికీ కళా సేవా పీఠం తరపున శుభాకాంక్షలు తెలిపారు. కళా సేవా పీఠం ప్రధాన కార్యదర్శి కొంతం నూకరాజేశ్వరరావు మాట్లాడుతూ.. 'కమిటీ కుర్రోళ్ళు' చిత్రానికి ఉత్తమ చిత్రంగా గుర్తింపు రావడం, 'కల్కి' చిత్రానికి ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా అవార్డు దక్కడం తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమన్నారు. 'కల్కి' చిత్రానికి అద్భుతమైన సెట్టింగ్స్, విజువల్స్ అందించిన ఉత్తమ ప్రొడక్షన్ డిజైనర్ జిహాని చౌదరి, 'పుష్ప-2' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా దర్శకుడు సుకుమార్, 'లక్కీ భాస్కర్' చిత్రానికి ఉత్తమ సంభాషణలు అందించిన దర్శకుడు వెంకీ అట్లూరి, ఉత్తమ నటిగా యామి గౌతమి, ఉత్తమ మేకప్ ఆర్టిస్టుగా పి. రవికుమార్ తదితరులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ బాల నటుడిగా ఎంపికైన పోతుల అరుణ్ దేవ్‌ను కళా సేవా పీఠం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా అరుణ్ దేవ్ మాట్లాడుతూ.. తనపై చూపుతున్న ఆదరాభిమానాలు, అందిస్తున్న ఆశీర్వాదాలే తనలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతుల అరుణ్ దేవ్ తల్లిదండ్రులు సత్యవేణి, సురేష్తో పాటు తాండ్రంగి రామారావు, మిద్దె అప్పారావు, వై. రమణరావు, వెంకట్, భాస్కర్ పాణిగ్రాహి, నాయుడు, ఏ. విశ్వేశ్వరరావు, వెంకట్రావు, కె. నాగలక్ష్మి, శోభారాణి, చిన్నములు, పద్మ, పి. ప్రసాద్, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొని అరుణ్ దేవ్‌ను అభినందించారు. తెలుగు సినిమా ప్రతిభకు జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు యువ కళాకారులకు మరింత స్ఫూర్తినిస్తుందని కళా సేవా పీఠం ప్రతినిధులు పేర్కొన్నారు.

# నీటి సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం వాసుపల్లి



- దక్షిణ వైసీపీ ఆధ్వర్యంలో 14న నీటి సమస్యపై ధర్నా
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 13:** విశాఖ నగరంలోని ముఖ్యంగా దక్షిణ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ ఈనెల 14న ఉదయం 10 గంటలకు జగదాంబ జంక్షన్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆశీలమెట్టలోని పార్టీ కార్యాలయంలో గురువారం దక్షిణ నియోజకవర్గ వైఎస్సా ర్‌సీపీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు, పార్టీ నాయకులకు ధర్నా నిర్వహణపై వాసుపల్లి పలు సూచనలు చేశారు.

దక్షిణ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో పేద, మధ్యతరగతి కుటుంబాలు నివసిస్తున్నాయని, గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్యతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాసుపల్లి పేర్కొన్నారు. పైపులైన్ల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం కనీసం కలుషిత నీరు కూడా సరఫరా కాకుండా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ప్రజల నీటి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు మహిళలతో కలిసి జగదాంబ జంక్షన్‌లో వినూత్న రీతిలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా విశాఖలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మరింత తీవ్రస్థాయిలో పోరాటాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

విశాఖ నగర అభివృద్ధి, ప్రజల మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే తగిన సమాధానం చెబుతారని వాసుపల్లి వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే ప్రభుత్వ పనితీరుపై తీర్పు ఇస్తారని అన్నారు.

సమన్వయ కమిటీ సమావేశంలో వార్డు అధ్యక్షులు నీలపు సర్వేశ్వరరెడ్డి, దస్మాంతుల మాణిక్యాలరావు, ఆలుపన కనకరెడ్డి, మహమ్మద్ షకీల్, గురజారపు రవి, భీశెట్టి ప్రసాద్, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి ఆదివిష్ణు, జిల్లా ఆర్టీఐ అధ్యక్షుడు వడ్డది దిలీప్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి సాగర్, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపల్లి శివ, జిల్లా స్టూడెంట్ విభాగం కార్యదర్శి పిలక మోహన్, సౌత్ బీసీ సెల్ అధ్యక్షుడు బొండాడ వెంకటరావు, సౌత్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రాజా పాత్రుడు, సౌత్ వికలాంగుల విభాగం అధ్యక్షుడు గరికిన చంద్రశేఖర్, సౌత్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకుల శ్యామ్, కొణతాల కృష్ణవేణి, మహమ్మద్ అనీష్, విజయ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖ పశ్చిమలో ఘనంగా 'తిరంగా యాత్ర'

- దేశభక్తి నినాదాలతో మార్మోగిన బైక్ ర్యాలీ
- భారీగా పాల్గొన్న మాజీ సైనికులు, కూటమి నాయకులు, యువత



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఆగస్టు 13** : 80వ స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాలు, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాల్లో భాగంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో గురువారం భారీ స్థాయిలో 'తిరంగా యాత్ర' బైక్ ర్యాలీ నిర్వహించారు. విశాఖ పశ్చిమ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ దేశభక్తి నినాదాలు, జాతీయ జెండాల రెపరెపలతో ఉత్సాహభరితంగా సాగింది. గోపాలపట్నం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎన్.ఎ.డి. జంక్షన్ మీదుగా కరస వరకు కొనసాగింది. ర్యాలీలో మాజీ సైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ద్విచక్ర వాహనాలపై జాతీయ జెండాలను చేతబూని పాల్గొన్న యువత దేశభక్తిని చాటుతూ ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. దేశభక్తి అనేది కేవలం ఒక రోజు కార్యక్రమానికి పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని అన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలంతా ఉత్సాహంగా భాగస్వాములు కావాలని, ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగిరేలా చూడాలని ఆయన కోరారు. జాతీయ జెండా మన స్వాతంత్ర్యానికి, దేశ సమైక్యతకు, త్యాగాలకు ప్రతీక అని పేర్కొన్నారు. తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ర్యాలీ మార్గంలో ప్రజలు ఆసక్తిగా తిలకించడంతో పాటు దేశభక్తి నినాదాలతో పాల్గొనేవారిని ఉత్సాహపరిచారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ తిరంగా యాత్ర నియోజకవర్గంలో దేశభక్తి వాతావరణాన్ని మరింత పెంపొందించింది. 'హర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేసి దేశ స్వాతంత్ర్యానికి, అమరవీరుల త్యాగాలకు గౌరవం చాటాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# కేజీబీవీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడితే నమ్మొద్దు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగష్టు 13:**అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు దళారులు, మధ్యవర్తులు అభ్యర్థులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ వి.ఏ. స్వామినాయుడు తెలిపారు.కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు చెల్లించాలని కోరుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఫోన్‌పే నంబర్లు, అనుమానాస్పద లింకులు పంపిస్తున్నారని తెలిపారు. ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే చెల్లించవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, అభ్యర్థుల విద్యార్హతల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఆటోమేటెడ్ మెరిట్ విధానంలో జరుగుతుందని స్పష్టం చేశారు. ఎలాంటి సిఫార్సులు, డబ్బు లావాదేవీలకు తావులేదని పేర్కొన్నారు. ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల వివరాలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.




03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం.

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.రమణ.




**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 13.** ప్రతి ఇంటిపై జాతీయ జెండా( హర్ ఘర్ తిరంగా ) కార్యక్రమాన్ని చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. రమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏపీ ఉన్నత విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసే కార్యక్రమాన్ని ఉద్దేశించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి దేశభక్తి, జాతీయ సమైక్యతా భావాన్ని చాటాలని, 80 వ స్వాతంత్ర దినోత్స వాన్ని పురస్కరించుకొని కళాశాలలో జాతీయ జెండా ప్రాధాన్యత పై విద్యార్థులకు అవగాహన పెంపొందించడం జరిగిందన్నారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, స్వాతంత్రానికి ప్రతీక అని తెలిపారు. ప్రతి విద్యార్థినీ విద్యార్థులు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటాలని సూచించారు. జాతీయ జెండా నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలని, జెండాను ఎగరవేసేటప్పుడు గౌరవప్రదంగా ఎగురవేయాలని తెలిపారు, కళాశాల విద్యార్థులు అధ్యాపకులు కలిసి కళాశాల పరిసర ప్రాంతాల్లో ప్రజలకు జాతీయ జెండా ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. దేశ సమగ్రత ఐక్యత జాతీయ భావాలను పెంపొందించడంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఆగస్టు 13:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'జ్ఞానజ్యోతి 120 డేస్ సర్టిఫికెట్ కోర్స్'లో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు బాలల విద్య, సంరక్షణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని, మాలతీదేవితో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విబిజిరామ్ జి శ్రామికుడు సెగ్గే నూకరాజు కు గాయాలు



**కొయ్యూరు, పెన్ పవర్ ఆగస్టు 13:** వి బి జి రామ్ జి ఉపాధి శ్రామికుడుకు కాలు విరిగిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పెద్దమాకవరం పంచాయతీ రామరాజుపాలెం గ్రామానికి చెందిన సెగ్గే నూకరాజు (బుజ్జి బాబు) ప్రతిరోజు మాదిరిగానే గురువారం వి బి జి రామ్ జి పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న తరుణంలో పెద్దగట్టు పై నుండి కాలు జారి పడిపోవడంతో కుడికాలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు విబిజి రాంజీ శ్రామికులు వెనువెంటనే నర్సీపట్నం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దీంతో కుడి కాలు విరిగినట్లుగా డాక్టర్ల నిర్ధారించి వైద్య సేవలు అందించారు. నూకరాజు పై ఆధారపడిన కుటుంబ సభ్యులు తమ జీవనోపాధిపై ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వము అధికారులు గుర్తించి వి బి జి రాంజీ శ్రామికుడు నూకరాజుకు ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగా

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 13:** భారత ప్రభుత్వం పిలుపు మేరకు పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల భవనంపై జాతీయ జెండాను ఎగురవేసి, విద్యార్థులు, సిబ్బంది జాతీయ జెండాకు సెల్యూట్ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశభక్తి, ఐక్యతా భావాలను పెంపొందించే గొప్ప కార్యక్రమమన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం దీని ప్రధాన ఉద్దేశమని, త్రివర్ణ పతాకం దేశ గౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. శ్రీనివాస పాత్రులు మాట్లాడుతూ.. 'తిరంగా మన గర్వం--భారత్ మన గౌరవం' అనే స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో



ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జానకిరావు, పి. కోటేశ్వరరావు, పి. కామేశ్వరరావు, డాక్టర్ సునీత, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి జి. గౌరీశంకర్రావు, వి. శంకర్రావు, ధర్మారావు, బాలరాజు, అశోక్, రాధాకుమారి, వి. జయలక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర సమరయోధుడు బోనంగి పండు పడాల్ 126వ జయంతి ఉత్సవాలు.



పూలమాలతో ఘన నివాళులర్పించిన జడ్పిటిసి పోతురాజు బాలయ్య.

చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 13.

స్వాతంత్ర సమరయోధులు, అల్లూరి ముఖ్య అనుచరుడు బోనంగి పండు పడాల్ 126వ జయంతి సందర్భంగా ఆయన స్వగృహ ఆవరణంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జడ్పిటిసి పోతురాజు బాలయ్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కంకిపాటి వీరన్నపడాల్ ( బాబులు ) ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్య ప్రాంతంలో బ్రిటిష్ పాలకుల దురాగతాలను, దుర్మార్గాలకు ఎదురు నిలిచి హక్కులు ఆత్మగౌరవ స్వేచ్ఛ కోసం పల్లేరు తో కలిసి పోరాడిన గిరిజన స్వతంత్ర సమరయోధుడు పండు పడాలని కొనియాడారు. అల్లూరి సీతారామరాజు ముఖ్య అనుచరులు ఒకరిగా ఆయన పేరు నిలిచిపోయిందని,బ్రిటిష్ పోలీసులపై పలు దాడులలో పాల్గొని చివరికి బ్రిటిష్ పోలీసుల చేతిలో చిక్కి న అనంతరం రాజమండ్రి కనుమూరు తిరుచినాపల్లి మద్రాసు తదితర జైలలో శిక్షణ అనుభవించి ఆయన చివరకు అండమాన్ జైలుకు తరలించారు అన్నారు. కాళీ పాణి జైల్లో ఖైదీ నెంబర్ 48 970 నెంబర్తో ఆయన శిక్షణ అనుభవించారన్నారు. నిర్బంధ జీవితం మన్యం వీరుల త్యాగానికి నిదర్శనమని తమ జీవితాన్ని త్యాగాలు చేసిన గిరిజన నాయకులను ఎప్పటికీ మరువరాదని కోరారు. యాగాలు చేసి స్వాతంత్రం కోసం పోరాటపటిమని చూపించిన నాయకులకు పార్టీలకతీతంగా స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు అరడ వీరబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గెమ్మెల రామచంద్రరావు, సులభం నాగమ నాయుడు, వంతల అర్జున్, కొర్ర బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో గంగోత్రి ప్రతిభ



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 13:** జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణి రాజాన గంగోత్రిని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఐఏఎస్ అభినందించారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో గంగోత్రిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. గంగోత్రి భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కాగా, తెలంగాణలోని మొయినాబాద్ జ్వాలా గుత్తా అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగిన 'నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ఫర్ ది డెఫ్' పోటీల్లో విజయవాడ బధిర క్రీడాకారులు సత్తాచాటారు. దేశంలోని ఏడు ప్రాంతీయ జట్లతో పోటీపడిన విజయవాడ జట్టు ఓవరాల్ టీమ్ విభాగంలో మూడో స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేతలను ఈ సందర్భంగా అభినందించారు.

## చింతపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులు- ఐసిడిఎస్ సిడిపిఓ సిహెచ్. శ్రీదేవి.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 13.**

అంగన్వాడీ కార్యకర్తలకు పూర్వ ప్రాథమిక విద్య బోధన బలోపేతం చేయడంలో జ్ఞాన జ్యోతి శిక్షణ తరగతులను స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్వహించినట్లు సిడిపిఓ సిహెచ్ శ్రీదేవి తెలిపారు.

గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం విద్యా శాఖలో టీచర్లకు అంగన్వాడీ సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ రెండు శాఖలకు సంబంధించి శిక్షణ పొందిన శిక్షకులు చింతపల్లి మండలంలో 249 అంగన్వాడీ కార్యకర్తలకు మూడు గ్రూపులుగా విభజించి మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించారని ప్రాథమిక విద్యా కార్యక్రమాలు నూతన ఒరవడిలో శిక్షణ అందించారన్నారు. కార్యకర్తల్లో ప్రీ స్కూల్ కార్యక్రమాలపై నైపుణ్యాభివృద్ధి, అంగన్వాడీ పిల్లల పోషణ, ఆరోగ్యం, రక్షణ, సంరక్షణకు సంబంధించి ఆదాశీల, నవ చేతన, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పాఠశాల సంసిద్ధత, అంగన్వాడీల్లో డిజిటల్ సాధనాల అమలు మొదలైన అంశాలపై శిక్షణా తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ పిఓ సిహెచ్ శ్రీదేవి, మండల విద్యాశాఖ అధికారి పి వి ప్రసాద్, సీనియర్ సహాయకులు ఎం ఎన్ డి శర్మ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి గ్రూపు జి సౌజన్య, డి. జయ భారతి విద్యాశాఖకు సంబంధించి డి శశి కుమార్ ఎంపీపీ స్కూల్ ఉరిసింగి బోధించారు. రెండో గ్రూపు ఎస్ గౌరీ, ఎం లక్ష్మి విద్యా శాఖకు సంబంధించి ఎస్ఎన్ పాత్రుడు హెచ్ఎం ఎంపిపి స్కూలు చౌడ్రాయి నిర్వహించారు. మూడవ గ్రూపు డి తులసి విద్యాశాఖకు సంబంధించి జి సత్యనారాయణ హెచ్ఎం ఎంపీపీ పాఠశాల చౌటపాడు శిక్షణను అందించారన్నారు.

# పీకే గూడెంలో ఆవుల చోరీ ... నిందితులను పట్టుకున్న పోలీసులు...

**టవర్ డంప్ విశ్లేషణతో 34 వేల ఫోన్ కాల్స్... చివరకు దొంగల అరెస్టు...**

**డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి...**

**నాతవరం,పెన్ పవర్ (ఆగస్టు 13):** నాతవరం మండలం పీకే గూడెం గ్రామంలో జరిగిన ఆవుల దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు.ఈ ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడు అచ్చిత తమ్మయ్యతో పాటు మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు.నాతవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు.పీకే గూడెం గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ,అదే గ్రామానికి చెందిన అచ్చిత తమ్మయ్య మధ్య గత ఐదేళ్లుగా ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని తెలిపారు.తమ్మయ్య పలుమార్లు డబ్బులు అడిగినా సత్యనారాయణ ఇవ్వకపోవడంతో అతనిపై కక్ష పెంచుకున్నట్లు చెప్పారు.ఈ నేపథ్యంలో సత్యనారాయణకు చెందిన మూడు ఆవులు, మూడు దూడలను దొంగిలించేందుకు తమ్మయ్య పథకం రచించినట్లు డీఎస్పీ తెలిపారు. పథకంలో భాగంగా తమ్మయ్య తన స్నేహితులు వెంకటేష్, శ్రీనులను అర్ధరాత్రి సత్యనారాయణ పశువుల పాక వద్దకు పంపినట్లు చెప్పారు. వారు తాము పోలీసులమని చెప్పి, పేకాట సమాచారంపై విచారణ చేయాల్సి ఉందంటూ సత్యనారాయణను కారులో కొంతదూరం తీసుకెళ్లి అక్కడే వదిలేసినట్లు వివరించారు.అనంతరం తమ్మయ్యతో పాటు మరో ఏడుగురు కలిసి ముందుగా సిద్ధం చేసుకున్న వాహనాల్లో మూడు ఆవులు,మూడు దూడలను తరలించి కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ప్రాంతంలోని ఓ వ్యక్తి వద్ద ఉంచినట్లు డీఎస్పీ వెల్లడించారు.



కేసు దర్యాప్తులో భాగంగా టవర్ డంప్ విశ్లేషణ చేపట్టి సుమారు 34 వేల ఫోన్ కాల్స్‌ను పరిశీలించినట్లు డీఎస్పీ తెలిపారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు.ప్రధాన నిందితుడు తమ్మయ్యతో పాటు సహకరించిన మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన సీఐ రేవతమ్మ, ఎస్సై తారకేశ్వరరావులను డీఎస్పీ అభినందించారు.హెడ్ కానిస్టేబుల్ గురునాథ్,పోలీసు సిబ్బంది లవరాజు,సత్యనారాయణ,మహేష్, సన్యాసిరావులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సత్కరించినట్లు తెలిపారు.దొంగతనానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సహకరించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# జీతాల బిల్లు పెట్టమని అడిగి నందుకు సిబ్బందిపై దాడి!

- ఏకలవ్య పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ బరితెగింపు.
- ప్రిన్సిపాల్ నిర్లక్ష్యపు తీరుపై సర్వత్రా విమర్శలు.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 13.**నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న తమ జీతాల గురించి అడిగినందుకు గాను కిందిస్థాయి సిబ్బందిపై ఓ జూనియర్ అసిస్టెంట్ భౌతిక దాడికి దిగిన దారుణ ఘటన చింతపల్లిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ (ఈఎంఆర్) పాఠశాలలో చోటుచేసుకుంది. మహిళ అని కూడా చూడకుండా ఏఎన్ఎంపై చేయి చేసుకోవడంతో పాటు, అడ్డుకోబోయిన మరో ఉద్యోగిపైనా అతను ప్రతాపం చూపడం స్థానికంగా కలకలం రేపింది. పాఠశాలలో గత మూడేళ్లుగా ఏఎన్ఎంగా పనిచేస్తున్న కే. సుజాతతో పాటు ఇతర నాన్-టీచింగ్ సిబ్బందికి ఈ ఏడాది మే నెల నుంచి జీతాలు అందలేదు. మే, జూన్ నెలల జీతాలు చెల్లించాల్సిందిగా మూడు రోజుల క్రితమే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తమ జీతాల బిల్లులు సిద్ధం చేయాలని జూనియర్ అసిస్టెంట్ సుమిత్‌ను గురువారం ఉదయం సిబ్బంది కోరారు. మధ్యాహ్నం వరకు వేచి చూడాలని చెప్పిన అతను, తీరా మధ్యాహ్నం వెళ్లి అడిగేసరికి తీవ్ర దురుసుగా ప్రవర్తించాడు.

దీంతో జీతం బిల్లుల గురించి నిలదీసిన ఏఎన్ఎం సుజాతపై సుమిత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ చెంపపై కొట్టాడు. ఆమెను రక్షించేందుకు యత్నించిన ఆఫీస్ సబార్డినేట్ కోటేశ్వరరావుపై కూడా దాడికి తెగబడ్డాడు. సుమిత్ మొదటి నుంచి కింది స్థాయి సిబ్బంది పట్ల అత్యంత చులకనభావంతో వ్యవహరిస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలకు పనిచేస్తున్న తమను తరచూ అవమానిస్తుంటాడని, ఉద్దేశపూర్వకంగానే అర్థంకాని హిందీ భాషలో మాట్లాడుతూ కించపరుస్తాడని వారు వాపోయారు. తోటి మహిళా ఉద్యోగిపై దాడి జరిగితే తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్.. 'రెండు రోజులు వేచి చూడండి' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం పలు విమర్శలకు దారి తీస్తోంది. ఈ అమానుష ఘటనపై బాధితురాలు సుజాత చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా, బాధితురాలిని మహిళా సంఘాల నాయకులు కాగి వెంకాయమ్మ, కవడం కాసులమ్మ పరామర్శించి అండగా నిలిచారు. విధి నిర్వహణలో ఉన్న మహిళపై చేయి చేసుకున్న జూనియర్ అసిస్టెంట్ సుమిత్‌ను వెంటనే విధుల నుంచి తొలగించి, కఠిన చర్యలు తీసుకోవాలని తోటి సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# అడవుల సంరక్షణ, మనందరి బాధ్యత.

- చింతపల్లి డివిజన్లో ఘనంగా 'ఏఎస్ఆర్ అరణ్య'.
- డాక్యుమెంటరీతో విద్యార్థులకు పర్యావరణ పాఠాలు.
- 'ఒక విద్యార్థి - ఒక చెట్టు' నినాదంతో మొక్కల దత్తత




**చింతపల్ల పెన్ పవర్ ఆగస్టు 13.**అడవులు, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే అవగాహన కల్పించే దిశగా అటవీశాఖ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన 'ఏఎస్ఆర్ అరణ్య కార్యక్రమంలో భాగంగా కొయ్యూరు మండలంలో అవగాహన కార్యక్రమాలను చింతపల్లి డివిజనల్ అటవీ అధికారి వైవి నరసింహారావు ఆదేశాల మేరకు చింతపల్లి అటవీ రేంజ్ అధికారి బి.అప్పారావు సూచనలతో నిర్వహించారు. అందులో భాగంగా గురువారం కొయ్యూరు మండలంలోని డౌనూరు జీటీడబ్ల్యూఏ, కొండసంత ఎంపీపీ పాఠశాలల్లో అటవీ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు అడవుల రక్షణ, పర్యావరణ ఆవశ్యకతను విపులంగా వివరించారు. జిల్లావ్యాప్తంగా విస్తరించి ఉన్న అపారమైన వృక్ష సంపద, వన్యప్రాణులు, ఎత్తైన కొండలు, సుందరమైన లోయల విశిష్టతను కళ్లకు కట్టేలా ఓ ప్రత్యేక డాక్యుమెంటరీ వీడియోను ప్రదర్శించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్తులో చెట్లను నరికివేయకుండా అడవులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. అనంతరం "వన్ స్టూడెంట్ - వన్ ట్రీ" (ఒక విద్యార్థి - ఒక చెట్టు) నినాదంతో పాఠశాలల ఆవరణలో విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. నాటిన ప్రతి మొక్కను విద్యార్థులే దత్తత తీసుకుని, అవి పెద్ద వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించేలా బాధ్యతలు అప్పగించారు. ?ఈ పర్యావరణ చైతన్య కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, కొండసంత ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.సింహాచలం, డౌనూరు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.వరహాలబాబు, కొండసంత ఎఫ్‌బీఓ ఎల్.శ్వేతలతో పాటు పలువురు ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 13** :పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న 'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్య క్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, విద్యాసం స్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, విద్యా ర్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటా లని ఆమె కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, పచ్చని వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకం ఎంతో అవసరమన్నారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ స్వీకరించాలని సూచించారు. దేశాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగ స్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

# గిరిజన హక్కుల పరిరక్షణకు ప్రత్యామ్నాయ జీవో తీసుకురావాలి



**రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేసిన అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజ రాణి**

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,ఆగస్టు 13:** షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనుల హక్కులు, ఉద్యోగ అవకాశాల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగ, విద్యా అవకాశాలకు సంబంధించిన అంశాలను రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జీవో నం.3కు ప్రత్యామ్నాయంగా కొత్త జీవోను తీసుకురావాలని ఎంపీ కోరారు. షెడ్యూల్డ్ ఏరియాల్లో ఉపాధ్యాయులు సహా కీలక ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానిక గిరిజనులకు అధిక ప్రాతినిధ్యం కల్పించేలా చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు అందేలా ప్రత్యేక విధానం రూపొందించాలని కోరారు.గిరిజనుల భూమి, జీవనాధారం, హక్కుల పరిరక్షణలో 1/70 భూ బదలాయింపు చట్టం కీలకమని తనూజ రాణి రాష్ట్రపతికి వివరించారు. షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా 1/70 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులకు సంపూర్ణ రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజనుల రాజ్యాంగ హక్కులు, షెడ్యూల్డ్ ఏరియాల ప్రత్యేక రక్షణ, భూమి హక్కులు, ఉద్యోగ అవకాశాలపై ఎంపీ చేసిన విజ్ఞప్తికి రాష్ట్రపతి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర న్యాయశాఖ, గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ తదితరులతో సంప్రదించి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చినట్లు ఎంపీ పేర్కొన్నారు. దీనిపై ఆమె సంతృప్తి, సంతోషం వ్యక్తం చేశారు.

# అస్తిత్వ రక్షణకు మరో పోరు తప్పదు.

- స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో ఉద్యమించాలి.
- హైడ్రోపవర్, బాక్సైట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ చిన్నయ్య పడాల్.
- గొందిపాకాలలో ఘనంగా అల్లూరి అనుచరుడు పండు పడాల్ 136వ జయంతి.



**చింతపల్లి పెన్ పవర్ ఆగస్టు 13.**బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అనుచరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బోనంగి పండు పడాల్ 136వ జయంతి వేడుకలు గురువారం చింతపల్లి మండలం గొందిపాకాలలో ఘనంగా జరిగాయి. పండు పడాల్ విగ్రహానికి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు, హైడ్రోపవర్-బాక్సైట్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ.. గిరిజనులు తమ అస్తిత్వాన్ని, అటవీ హక్కులను కాపాడుకునేందుకు పార్టీలకతీతంగా మరో పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. 1922-24 మధ్య జరిగిన రంపచోడవరం పితూరీలో బోనంగి పండు పడాల్ తన 24వ ఏటనే బ్రిటిష్ వారిని ఎదిరించి వీరోచితంగా పోరాడారని చిన్నయ్య పడాల్ కొనియాడారు. చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, జి.మాడుగుల, కేడీ పేట, గొలుగొండ, అడ్డతీగల, రంపచోడవరం మండలాల్లోని 186 గ్రామాల నుంచి సుమారు 276 మంది ఆదివాసీలు అల్లూరి అనుచరులుగా పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ ప్రాంత రక్షణ కోసం లాఠీ దెబ్బలు, జైలు, ఉరి శిక్షలను సైతం లెక్కచేయని వీరుల త్యాగాలను పాలకులు విస్మరించడం దారుణమన్నారు. నాడు ఏ అడవి, భూమి రక్షణ కోసం గిరిజనులు పోరాడారో.. నేడు అదే ప్రాంతం ప్రభుత్వాల విధానాల వల్ల కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని మండిపడ్డారు. గతేడాది పండు పడాల్ జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్ గిడ్డి ఈశ్వరి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని చిన్నయ్య పడాల్ నిలదీశారు. ఇచ్చిన మాటను నెరవేర్చకుండా మళ్లీ విగ్రహానికి పూలమాలలు వేయడానికి ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కేవలం కొద్దిమందికే పరిమితం కాకుండా, ఉద్యమంలో పాల్గొన్న 276 మంది ఆదివాసీ సమరయోధుల కుటుంబాలకు ఆహ్వానాలు పంపి, సత్కరించాలని డిమాండ్ చేశారు. ఆయా కుటుంబాలకు ఉపాధి, భూమి, ఉద్యోగ అవకాశాలు కల్పించి అండగా నిలిచినప్పుడే ఆ వీరుల పోరాటానికి నిజమైన గుర్తింపు దక్కుతుందన్నారు. అంతకుముందు చింతపల్లి తహసీల్దార్ త్రివేణి పండు పడాల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పండు పడాల్ మునిమనవళ్లు, మాజీ సర్పంచులు జనకని రామారావు, జనకని కనకారావు, ఐటీడీఏ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.బి.పడాల్, అఖిల భారత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు బౌడు గంగరాజు, ఉపాధ్యాయులు బోనంగి ప్రసాద్, బీజేపీ నాయకులు బోనంగి బాలయ్య పడాల్, టీడీపీ నాయకులు బోనంగి బెనలింగేశ్వరరావు, బోనంగి సోమలింగం, చిట్టి పడాల్, చంటి పడాల్ తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఉద్యోగుల పోరాటం బెజవాడకు చేరింది

**ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఇవ్వాలని జేఏసీ చైర్మన్‌కు వినతి**



**విశాఖ తూర్పు పెన్ పవర్, ఆగస్టు 13:**
ప్రెసిడెన్షియల్ ఉత్తర్వుల నుంచి తమను మినహాయించాలని కోరుతూ జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులు చేపట్టిన పోరాటం బుధవారం బెజవాడకు చేరింది. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ను పలు ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి కలిసి వినతిపత్రం అందజేశారు.

జీవీఎంసీ ఏర్పాటు చట్టంలోని అంశాలను వివరిస్తూ ఉద్యోగులందరినీ ఒకే యూనిట్‌గా కొనసాగించాలని, నియామక అధికారిగా కమిషనర్‌నే ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా 'ఒకే యూనిట్.. ఒకరే కమిషనర్' అంటూ నినాదాలు చేశారు.

జీవీఎంసీ 'విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, 1979' ప్రకారమే నిర్వహించబడుతోందని, మినిస్టీరియల్ విభాగానికి ప్రత్యేక సర్వీసు నిబంధనలు ఉన్నాయని ఉద్యోగులు తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి సర్వీస్ ప్రొవిన్షియలైజేషన్ జరగలేదని, ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లిస్తోందన్నారు.

గత నెల 24న విడుదలైన జి ఒ 135 ను పునఃపరిశీలించి సవరించిన ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల సమస్యలు విన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, సానుకూలంగా స్పందించారని జీవీఎంసీ మినిస్టీరియల్ ఉద్యోగులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వి యం సి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ వామనరావు, జీవీఎంసీ ఏఐటిసి అధ్యక్షులు పడాల రమణ. ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తిమ్మపర్తి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు. కోశాధికారి రవి.జీవీఎంసీ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అధ్యక్షులుఎ.అప్పలనాయుడు. సన్నీ లంకా రాంప్రసాద్ వి శ్రీనివాసరావు రాజేష్ జగన్ ప్రసన్న కుమార్ తో పాటు అధిక సంఖ్యలో ఉద్యోగాలు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com